www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి బుధవారం 30-11-2022 సంపుటి : 04 సంచిక :88 పేజీలు : 4 వెల : రూ 3-00

# ఏపీలో16 చోట్ల హెల్త్ హబ్‌లు

ఆరోగ్యశ్రీ కింద 50 శాతం పడకలు కేటాయించేలా ఒప్పందం

ప్రపంచస్థాయి ఆస్పత్రుల ఏర్పాటుకు ఆహ్వానం

పెట్టుబడులకు ఏపీ ప్రభుత్వం ఎంతో అనుకూలం

పెట్టుబడులు పెట్టేవారికి ఫోన్ కాల్ దూరంలో ప్రభుత్వం

వైద్య ఆరోగ్య రంగ స్వరూపాన్ని సీఎం జగన్ మార్చేస్తున్నారు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

ప్రతిష్టాత్మక ప్రైవేటు ఆస్పత్రుల యజమానులతో మంత్రి భేటీ

సీఐఐ ఆధ్వర్యంలో ఢిల్లీలో సమావేశం




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 16 చోట్ల హెల్త్ హబ్‌ల ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని, ఆ దిశగా చర్యలు కూడా తీసుకున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (భారత పరిశ్రమల సమాఖ్య) ఆధ్వర్యంలో సోమవారం రాత్రి న్యూ ఢిల్లీలో ఏపీ ప్రభుత్వ ఉన్నతస్థాయి ప్రతినిధులతో ప్రపంచ స్థాయిలో పేరున్న ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ యూనిట్ల అధినేతల సమావేశాన్ని నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంలో మంత్రి విడదల రజినితోపాటు వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జీఎస్ నవీన్‌కుమార్ ఉన్నారు. మేదాంత-ద మెడ్‌సిటీ, మణిపాల్, పనాసియా ఇండియా, పోలీ మెడిక్యూర్ లిమిటెడ్, బాస్క్ మరియు లోంబ్ ఐ కేర్ ప్రైవేట్ లిమిటెడ్, ఇండియన్ ఫార్మాస్యూటికల్స్ అలియన్స్, పారాస్ హాస్పిటల్స్, అపోల్ హాస్పిటల్స్ గ్రూప్, పీడీ హిందూజా హాస్పిటల్స్, చార్‌నాక్ హాస్పిటల్స్, ఉజాలా సైనస్, ప్రిస్టిన్ కేర్, మ్యాక్స్ హెల్త్ కేర్.... ఇలా దాదాపు 25కుపైగా ప్రఖ్యాత ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, వైద్య పరికరాల తయారీ కంపెనీల అధినేతలు హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అనువైన అవకాశాలను వారికి వివరించారు. సీఐఐ ప్రతినిధులు సైతం ఏపీలో వైద్య ఆరోగ్య రంగం కొత్త పుంతలు తొక్కుతోందని ఈ సమావేశంలో ప్రశంసించారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పేదలకు మరింత మెరుగైన వైద్యం, మరింత చేరువ చేసే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హెల్త్ హబ్‌లను ఏర్పాటుచేస్తున్నారని తెలిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో కనీసం 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఎవరైతే ముందుకు వస్తారో.. వారికి ఉచితంగా 5 ఎకరాల స్థలం ప్రభుత్వమే ఇస్తుందని తెలిపారు. ఆస్పత్రులను త్వరగా నిర్మించి, 50 శాతం పడకలను ఆరోగ్యశ్రీ పథకం లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల పేదలకు ప్రపంచస్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించేవీలు ఏర్పడుతుందని తెలిపారు. హెల్త్ హబ్‌ల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఆస్పత్రుల యాజమాన్యాలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని తెలిపారు. సింగిల్ విండో విధానం ద్వారా ప్రభుత్వ అనుమతులన్నీ ఇచ్చేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారని చెప్పారు. విశాఖపట్టణంలోని మెడ్ సిటీ లో ఇప్పటికే ఎన్నో సంస్థలు ఏర్పాటయ్యాయని, అవి వాటి కార్యకలాపాలను విజయవంతంగా కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. మెడ్‌సిటీలో పెట్టుబడులు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తున్నదన్నారు. ఏపీలో ప్రస్తుతం 2200కుపైగా ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందుతోందని మంత్రి తెలిపారు. ఏకంగా 3255 చికిత్సలకు ఉచితంగా వైద్యం అందుతోందన్నారు. ఏటా రూ.3వేల కోట్లు ప్రభుత్వం ఈ పథకం కోసం ఖర్చు చేస్తున్నదన్నారు. వైద్యం చేసిన ప్రతి ఆస్పత్రికి బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. భారీగా ఖర్చయ్యే 15 చికిత్సలకు పూర్తి ఉచితంగా ప్రభుత్వమే వైద్యం చేయిస్తోందని వివరించారు. వేల కోట్ల ఖర్చు కాదు.. హెల్త్ హబ్‌ల ఏర్పాటుకు కావాల్సిన భూమి, అన్ని వసతులు కూడా ఇచ్చేందుకు జగనన్న ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ రాష్ట్రంలో 16 చోట్ల హెల్త్ హబ్ ల ఏర్పాటు, సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ల ఏర్పాటు, ఎమ్ ఆర్ ఐ, సీటీ, క్యాత్ ల్యాబ్‌ల ఏర్పాటు, డయాగ్నస్టిక్ సెంటర్ల ఏర్పాటు, వాటి నిర్వహణ, ఏపీలో ఆరోగ్యసేవల డిజిటలైజేషన్‌లో సహకారం..... లాంటి కీలక అంశాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆయా సంస్థలను కోరారు. పారిశ్రామిక వేత్తలకు తమ ప్రభుత్వం ఫోన్ కాల్ దూరంలో ఉంటుందని స్పష్టంచేశారు. అత్యాధునిక వైద్య వసతులు అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన




వైద్యం ఉచితంగా అందించేందుకు జగనన్న కట్టుబడి ఉన్నారని తెలిపారు. పేదలకు రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని ప్రభుత్వ పెద్ద ఆస్పత్రులన్నింటినీ ఆధునికీకరిస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల అనుబంధ ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు ఎన్‌ఏబీహెచ్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ హాస్పటల్స్) గుర్తింపు కూడా పొందుతున్నాయని తెలిపారు. ఏలూరు లాంటి ఆస్పత్రులకు ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు రావడం తమ ప్రభుత్వ విజయానికి నిదర్శమని వివరించారు.

## కొవిడ్ టీకా మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించదు..! 'సుప్రీం'లో కేంద్రం అఫిడవిట్

కొవిడ్-19 వ్యాక్సినేషన్‌ను ప్రజాప్రయోజనాల దృష్టా ప్రభుత్వం ప్రోత్సహించిందని, టీకాలు వేయడానికి చట్టపరమైన బలవంతం ఏమీ లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కొవిడ్ వ్యాక్సిన్ దుష్ప్రభావాల కారణంగా గతేడాది ఇద్దరు బాలికలు మరణించగా.. తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ సమాధానం ఇచ్చింది. ఇది విషాదకరమైనా.. ప్రభుత్వం మరణాలకు బాధ్యత వహించదని ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. అర్హులైన వ్యక్తులు టీకా వేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహించిందని, అయితే దానికి ఎలాంటి చట్టపరమైన బలవంతం లేదని అఫిడవిట్‌లో పేర్కొంది. అయితే, ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగస్టు 29న కేంద్రానికి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసింది. శవ పరీక్ష, విచారణ నివేదికలను సమయానుకూలంగా విడుదల చేయడంతో పాటు మరణంపై స్వతంత్ర కమిటీతో దర్యాప్తు చేయాలని సుప్రీంకోర్టు దాఖలైంది. మృతుల తల్లిదండ్రులకు పరిహారం ఇవ్వాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. వాక్సిన్ దుష్ప్రభావాలతో బాధపడుతున్న వ్యక్తులను ముందస్తుగా గుర్తించి చికిత్స అందించేందుకు మార్గదర్శకాలను రూపొందించేందుకు ప్రభుత్వానికి ఆదేశాలను ఇవ్వాలని పిటిషనర్లు కోర్టును కోరారు. ప్రతి వ్యాక్సిన్‌కు ఇమ్యునైజేషన్ (ంఇఈఎలు) అనుసరించే ప్రతికూల సంఘటనలు నివేదించబడుతున్నాయని, వ్యాక్సిన్లు థర్డ్ పార్టీలతో తయారవుతున్నాయని కేంద్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది కోర్టుకు తెలిపారు. కొవిడ్ వ్యాక్సినేషన్‌కు సంబంధించిన సమాచారం పబ్లిక్ డొమైన్‌లో ఉచితంగా అందుబాటులో ఉందని కోర్టుకు తెలిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ల నష్ట పరిహారం డిమాండ్‌ను ఆరోగ్యమంత్రిత్వ శాఖ తోసి పుచ్చింది. వ్యాక్సినేషన్ ప్రతికూల ప్రభావాలతో వ్యక్తి శారీరకంగా గాయమైనా, మరణించినా చట్టప్రకారం అతని కుటుంబం పరిహారం కోరుతూ సివిల్ కోర్టులో దావా వేయొచ్చని. నిర్లక్ష్యానికి సంబంధించిన కేసుల వారీగా కేసు నమోదు చేయవచ్చని అఫిడవిట్ పేర్కొంది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కొలిన్ గోన్సాల్వేస్ వాదనలు వినిపిస్తూ.. వ్యాక్సిన్‌తో కలిగే నష్టాలను ముందుగానే తెలియజేసి సమ్మతి తీసుకుని ఉంటే ఈ మరణాలు సంభవించి ఉండేవి కావన్నారు. వ్యాక్సిన్లు, మందులను స్వచ్ఛందంగా వాడేందుకు 'సమ్మతి' అనే ప్రశ్న వర్తించదని, మోతాకు సంబంధించి ప్రతికూల ప్రభావాలు స్వల్పంగా ఉంటాయని పేర్కొంది. ఈ నెల 19 వరకు దేశంలో 219.86కోట్ల డోసులు ఇవ్వగా.. వీటిలో 92,114 ప్రతికూల ప్రభావాల కేసులు నమోదయ్యాయని కేంద్రం తెలిపింది. ఇదిలా ఉండగా.. ఓ బాలిక గతేడాది 29న కోవిషీల్డ్ మొదటి డోసు తీసుకున్న తర్వాత జూన్ 19న మరణించింది. మరో ఎంఎస్సీ విద్యార్థిని గత ఏడాది జూన్ 18న కొవిషీల్డ్ మొదటి డోసు తీసుకోగా.. జూలై 10న కన్నుమూసింది.



## సీఎం జగన్ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలం

అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులను సత్వరమే పూర్తి చేయడానికి వీలుగా ముందస్తు (అడ్‌హక్) నిధులివ్వాలని కోరుతూ సీఎం వైఎస్ జగన్ చేసిన ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. తొలి, రెండో దశ పనులను పూర్తి చేయడానికి ఏ మేరకు నిధులు అవసరమో గుర్తించి 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)లను ఉన్నతస్థాయి కమిటీ సోమవారం ఆదేశించింది. ఈ నివేదిక ఆధారంగా నిధులు విడుదల చేయాలని కేంద్రమంత్రి మండలికి కేంద్ర జల్‌శక్తి, ఆర్థిక శాఖలు ప్రతిపాదనలు పంపనున్నాయి. దానిపై కేంద్ర మంత్రి మండలి ఆమోదముద్ర వేస్తే.. అడ్‌హక్‌గా పోలవరానికి నిధుల విడుదలకు మార్గం సుగమం అవుతుంది. రూ.10 వేల కోట్లను అడ్‌హక్‌గా విడుదల చేసి, నిధుల కొరత లేకుండా చేయాలని, డిజైన్లను త్వరితగతిన ఆమోదిస్తే పోలవరాన్ని సత్వరమే పూర్తి చేయవచ్చని ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు. అడ్‌హక్ నిధుల విడుదలతోపాటు సీఎం జగన్ లేవనెత్తిన అంశాలపై చర్చించడానికి ప్రధాని మోదీ ఆదేశాల మేరకు కేంద్రం కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీతో రెండుసార్లు రాష్ట్ర కమిటీ సమావేశమైంది. ఈ సమావేశాలలో అడ్‌హక్‌గా పోలవరానికి నిధులిచ్చేందుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని కేంద్ర జల్‌శక్తి శాఖను కేంద్ర కమిటీ ఆదేశించింది. ఇప్పటివరకూ ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులను రీయింబర్స్‌మెంట్ చేయడం, మార్చి వరకూ భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం, పనులు చేయడానికి రూ.7,300 కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది.

## వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం..

ఏపీలో రైతన్నలకు విరివిగా రుణాలు..

ఆర్‌బీఐ తాజా గణాంకాలు



అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రైతన్నలకు విరివిగా రుణాలు లభ్యమయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) విడుదల చేసిన తాజా గణాంకాలు స్పష్టం చేశాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన 2019 నుంచి ఈ ఏడాది మార్చి వరకు వరుసగా నాలుగేళ్లు రైతులకు బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు విరివిగా మంజూరయ్యాయి. ఇందుకు ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడమే. అలాగే సకాలంలో రుణాలు తిరిగి చెల్లించే రైతులకు సున్నా వడ్డీని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. దీంతో బ్యాంకులు రైతులకు వ్యవసాయ రుణాలను ఏడాదికేడాదికి పెంచుకుంటూ పోతున్నాయి. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని చంద్రబాబు మోసం చేశారు. దీంతో బాబు ఐదేళ్ల పాలనలో బ్యాంకుల నుంచి రైతులకు వ్యవసాయ రుణాల మంజూరు అంతకంతకూ తగ్గిపోతూ వచ్చింది. బాబు హయాంలో బ్యాంకులు రైతులకు వ్యవసాయ రుణాల మంజూరు తగ్గించేయడానికి ప్రధాన కారణం.. ఆయన రుణమాఫీ చేస్తానని చేయకపోవడమేనని వెల్లడైంది. ఆర్‌బీఐ తాజా గణాంకాల ప్రకారం.. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో వ్యవసాయ రుణాల మంజూరు 10.32 శాతం మేర తగ్గిపోయింది. మరోవైపు అదే సీఎం వైఎస్ జగన్ హయాంలో గత నాలుగేళ్లలో బ్యాంకుల నుంచి రైతులకు వ్యవసాయ రుణాల మంజూరు ఏకంగా 60.16 శాతం మేర పెరిగింది. 2014 మార్చి నాటికి వ్యవసాయ రుణాలు రూ.1,18,200 కోట్లు ఉండగా.. 2018 నాటికి ఈ మొత్తం రూ.1,06,000 కోట్లకు తగ్గిపోవడం గమనార్హం. సీఎం వైఎస్ జగన్ హయాంలో 2022 మార్చి నాటికి రూ.1,80,601 కోట్లకు వ్యవసాయ రుణాలు పెరిగాయి. మరోవైపు దేశం మొత్తం మీద బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాల మంజూరు అత్యధికంగా దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నట్లు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి. 2022 మార్చి నాటికి దేశం మొత్తం మీద రూ.17,03,315 కోట్లను బ్యాంకులు వ్యవసాయ రుణాలుగా మంజూరు చేశాయి. ఇందులో దక్షిణాది రాష్ట్రాలకు అత్యధికంగా రూ.7,66,911 కోట్లను మంజూరు చేయడం విశేషం. అంటే.. దేశం మొత్తం మీద మంజూరు చేసిన వ్యవసాయ రుణాల్లో దక్షిణాది రాష్ట్రాలకే 45.02 శాతం రుణాలు మంజూరయ్యాయి. దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడులో అత్యధికంగా రూ.2,52,472 కోట్ల రుణాలను బ్యాంకులు ఇచ్చాయి. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా రూ.1,80,601 కోట్లను మంజూరు చేశాయి. అలాగే కర్ణాటకలో రూ.1,37,241 కోట్లు, కేరళలో రూ.92,121 కోట్లు, తెలంగాణలో రూ.1,00,645 కోట్ల వ్యవసాయ రుణాలను మంజూరు చేసినట్టు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి.

## సుప్రీం తీర్పు తర్వాత టీడీపీ నేతలు మాట్లాడలేదేం?: సజ్జల



తాడేపల్లి: రాజధాని నగరాన్ని, రాజధాని ప్రాంతాన్ని ఆరు నెలల్లో నిర్మించి, అభివృద్ధి చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు నిలిపివేయటాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి. అమరావతిలోనే శాసన రాజధాని ఉంటుందని స్పష్టం చేశారు. మంగళవారం తాడేపల్లిలో సజ్జల మీడియాతో మాట్లాడారు. అన్ని ప్రాంతాలకూ న్యాయం చేసేందుకే వికేంద్రీకరణ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పు తర్వాత టీడీపీ నేతలు ఎవరూ మాట్లడకపోవటంపై ప్రశ్నించారు. 'సుప్రీం కోర్టు తీర్పు తర్వాత టీడీపీ నేతలు మాట్లాడలేదు. అన్ని ప్రాంతాలకూ న్యాయం చేసేందుకే వికేంద్రీకరణ నిర్ణయం. వికేంద్రీకరణపై మరింత పకడ్బందీగా చట్టం తీసుకొస్తాం. రాజధానిపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. అమరావతిలోనే శాసన రాజధాని ఉంటుంది.' అని పేర్కొన్నారు సజ్జల. వైఎస్ వివేకానంద హత్య కేసును తెలంగాణకు బదిలీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. వాస్తవాలు బయటకు రావాలని తామే ముందు కోరుకుంటున్నట్లు చెప్పారు. హత్యకు గురైన వివేకా తమ నాయకుడని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వయానా చిన్నాన్న అని గుర్తు చేశారు. తమ నాయకుడు వివేకా హత్యకు బాధ్యులేవరో వారు దొరకాలన్నారు.

## అలీ కుమార్తె వివాహ రిసెప్షన్‌కు సీఎం జగన్

అమరావతి/గుంటూరు వెస్ట్: సీఎం వైఎస్ జగన్ మంగళవారం గుంటూరు పర్యటనకు వెళ్లనున్నారు. ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీ నటుడు అలీ కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరవుతారు. సాయంత్రం తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 4.55 గంటలకు గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీ కన్వెన్షన్‌కు చేరుకుంటారు. నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. అనంతరం తాడేపల్లికి చేరుకుంటారు.



# సంపాదకీయం

బుధవారం 30-11-2022


## మళ్లీ తెరపైకి యూనిఫాం సివిల్ కోడ్

రాజ్యాంగం ఆదేశిక సూత్రాల్లో (ఆర్టికల్ 44) ఒకటైన ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫాం సివిల్ కోడ్ యుసిసి)ని తీసుకు రావడానికి కేంద్రం అడుగులు వేస్తోంది. కామన్ సివిల్ కోడ్‌ను అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మరోసారి స్పష్టం చేశారు. ఉమ్మడి సివిల్ కోడ్ హామీ ఈనాటిది కాదని, పాతదని హోంమంత్రి అమిత్ షా అన్నారు. దీనిపై రాజకీయం ఎందుకని ఆయన ప్రశ్నించారు. అసలు కాంగ్రెస్ సివిల్ కోడ్‌కుఅనుకూలమా ? వ్యతిరేకమా ? చెప్పాలని ఆయన ప్రశ్నించారు. తాము ఎన్నికలకు ముందు ఏం చెప్పామో అవన్నీ చేస్తున్నామని హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇక భారతీయ జనతా పార్టీ వీలైనంత తొందరంగా అమలులోకి తీసుకురావటానికి ఆరాటాన్ని ప్రదర్శిస్తున్నది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తాజాగా ఈ విషయాన్ని ప్రస్తావించారు. 2024 నాటికి ఉమ్మడి పౌర స్మృతిని చట్టంగా చేసే అవకాశాలున్నట్టు చెప్పారు. గుజరాత్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లలో ఇందుకోసం ఉన్నత న్యాయమూర్తుల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పడ్డాయని అవి అన్ని మత వర్గాల వారి అభిప్రాయాలను తీసుకుంటున్నాయని తెలిపారు. వివాహం, విడాకులు, వారసత్వ హక్కు, దత్తత వంటి అంశాల్లో అన్ని మతాల వారు ఒకే నియమ నిబంధనలు పాటించేలా చేయడమే ఉమ్మడి పౌర స్మృతి ఉద్దేశం. అయితే దీనిని చట్టం ద్వారా బలవంతంగా రుద్దితే వారు స్వీకరించి పాటించే అవకాశాలు అరుదు.ఇప్పటికే బాల కార్మిక నిషేధ చట్టం, వరకట్న వ్యతిరేక చట్టం, స్త్రీలకు ఆస్తి హక్కు చట్టం వంటివి అమలుకు నోచుకోక అరణ్య రోదన చేస్తున్న సంగతి తెలిసిందే. అయినప్పటికీ ఉమ్మడి పౌర స్మృతి పట్ల భారతీయ జనతా పార్టీ ఎందుకింత తొందరపాటును ప్రదర్శిస్తున్నది? గతంలో ట్రిపుల్ తలాక్ ద్వారా విడాకుల సంప్రదాయాన్ని నిషేధిస్తూ తీసుకు వచ్చిన ముస్లిం స్త్రీల (వివాహ హక్కుల రక్షణ) చట్టం ఆచరణలో ఏమైందో, దానిపై ఎటువంటి విమర్శలు వచ్చాయో తెలిసిందే. వాస్తవానికి ఇటువంటి పద్ధతులను సుప్రీంకోర్టు, ఇతర ఉన్నత న్యాయస్థానాలు నిరాకరిస్తూనే వున్నాయి. ట్రిపుల్ తలాక్ విడాకులు గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. అందుచేత చట్టం ద్వారా వారిని నేరస్థులను చేసి ఆయా మత వర్గాల మనోభావాలను దెబ్బ తీయడం మంచిది కాదు.అది బిజెపికి రాజకీయంగా మేలు చేయవచ్చునేమో గాని సమాజంలోని సామరస్యాన్ని దెబ్బ తీస్తుంది. ఇది తెలిసి కూడా ఉమ్మడి పౌర స్మృతి పట్ల బిజెపి హద్దులు మీరిన ఆసక్తిని కనపరుస్తున్నది. జనసంఘ్ నాటి నుంచి దీనిని వాగ్దానం చేస్తున్నామని, అమల్లోకి తేవలసిన సమయం వచ్చిందని, 2024 నాటికి సాధ్యం కాకపోతే ఆ ఎన్నికల్లో మళ్ళీ అధికారం చేపట్టిన తర్వాత ఉమ్మడి స్మృతిని తీసుకు వస్తామని అమిత్ షా అంటున్నారు. ఆలోగా ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో అమల్లో పెట్టడానికి ప్రయత్నిస్తున్నట్టు కనిపించడం ద్వారా మెజారిటీ హిందూ ఓటును మరింతగా ఆకట్టుకోడం బిజెపి ఉద్దేశంగా బోధపడుతున్నది. అన్ని మతాల్లోనూ వాటికే పరిమితమైన ప్రత్యేక ఆచార సంప్రదాయాలున్నాయి. వాటిలోని కొన్ని బలహీనులను అణచివేసేందుకు దోహదపడుతున్నాయి. సమాజం పూర్తిగా ప్రజాస్వామికీకరణ చెందే క్రమంలో అందులోని హానికరమైనవని భావించే వాటిని ఆయా మత వర్గాల వారే తొలగించుకుంటారు.అటువంటి పరిణతి సహజంగా వచ్చినప్పుడే ఉమ్మడి పౌర స్మృతి ఆశయం నెరవేరుతుంది. రాజ్యాంగాన్ని సిద్ధం చేస్తున్న సమయంలో డాక్టర్ అంబేడ్కర్ కూడా ఇటువంటి అభిప్రాయాన్నే వెలిబుచ్చారు. ఏ ప్రభుత్వమైనా ముస్లింలు, క్రైస్తవులు లేదా మరే మతవర్గంపైనా వారి అభీష్టానికి వ్యతిరేకంగా ఉమ్మడి స్మృతిని రుద్దితే అది మతి తప్పినదే కాగలదని ఆయన అభిప్రాయపడ్డారు. అందుచేత ఆయా వర్గాలు తమంత తాముగా అంగీకరిస్తే తప్ప దీనిని వారిపై రుద్దకూడదని అన్నారు. అందుచేతనే భవిష్యత్తులో సర్వానుకూల పరిస్థితి ఏర్పడినప్పుడు మాత్రమే అమల్లోకి తెచ్చే విధంగా ఈ లక్షాన్ని రాజ్యాంగ ఆదేశిక సూత్రాల్లో చేర్చారు. ఇప్పటికైతే అటువంటి ఆదర్శమైన సమాజం ఏర్పడలేదు. పైపెచ్చు పాలక పార్టీయే భిన్న ప్రజా వర్గాల మధ్య మత వైషమ్యాల చిచ్చును రగిలించడమో లేక వేరొకరు ఆ పని చేస్తూ వుంటే చూసీచూడనట్టు ఊరుకోడమో జరుగుతున్నది.అన్ని రకాల ప్రజాస్వామిక పద్ధతులను, చర్చలను ఆశ్రయించిన తర్వాతనే ఉమ్మడి పౌర స్మృతిని తెస్తామని అమిత్ షా అన్నారు. ఇది ఎంతో వినసొంపుగా వుంది. కాని మైనారిటీల పట్ల ద్వేషం నింపుకొన్న బిజెపి వంటి పాలక పక్షం నుంచి ప్రజాస్వామిక చర్చను, సంప్రదింపులను ఎదురు చూడగలమా? హిందూ ఆధిక్యత, ఆధిపత్యాలను నెలకొల్పడమే లక్షంగా ప్రజాస్వామిక అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న బిజెపి నుంచి అటువంటి వైఖరిని ఆశించగలమా? జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కలిగిస్తూ వచ్చిన రాజ్యాంగంలోని 370 అధికరణ రద్దును, దాని రాష్ట్ర హోదాను ఊడబెరకడాన్ని తాము సాధించిన గొప్ప లక్షంగా అమిత్ షా చెప్పుకొన్నారు. అయితే అక్కడి ప్రజలు హృదయపూర్వకంగా ఆమోదం తెలిపినప్పుడే ఆయన మాటలు వాస్తవమని రుజువవుతాయి. ఏ వర్గాలకు సంబంధించిన ఎటువంటి స్థితినైనా ఏకపక్షంగా మార్చడం వల్ల మంచి జరగదు. అది ఎవరి రాజకీయ ప్రయోజనాలకో చేసిందయితే దాని వల్ల అక్కడి సమాజానికి హాని మాత్రమే కలుగుతుంది.

# కిస్సా..కుర్సీకా...ఏపీలో కుర్చీలాట..

విజయవాడ, నవంబర్ 29, ఏపీలో వైసీపీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి విపక్షాలన్నీ ఏకం కావాలని ఇప్పటికే చంద్రబాబుతోపాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా పిలుపునిచ్చారు.. ఒకవేళ పవన్ కల్యాణ్ – చంద్రబాబు కలిసి రంగంలోకి దిగితే ఎవరెన్నిన్ని సీట్లలో పోటీ చేస్తారన్నది తేలాల్సి ఉంది. అంతేకాదు సిఎం అభ్యర్థి ఎవరన్నది కూడా స్పష్టం చేయాల్సి ఉంది. ఒకవేళ చంద్రబాబు సిఎం అయితే మరి జనసేన అధినేత ఏ పదవి తీసుకుంటారన్నది పాయింట్. పవన్ కల్యాణ్ కి పదవులపై ఆసక్తి లేకపోయినా ఆయన పార్టీ నేతలు, అభిమానులు మాత్రం ఊరుకుంటారా ? సిఎం పదవి తీసుకోవాల్సిందేనని పట్టుబడతారు. మరి చంద్రబాబు అండ్ టీమ్ జనసేన కోరికని తీర్చుతుందా అన్నది ఆలోచించాల్సిన విషయం. ఇక రెండవది టిడిపితో కాకుండా బీజేపీతో వెళ్తే జనసేన ఎన్నిసీట్లు గెలుస్తుందన్నది కూడా ఆలోచించాల్సిన విషయమేనంటున్నారు. ఎందుకంటే కాషాయానికి ఏపీలో పట్టులేదు. ఇక జనసేన అధినేతకి ఇమేజ్ ఉన్న గెలుపుకి అదెంత ఉపయోగపడతాయన్నది ఆలోచించాల్సిన విషయం. గత ఎన్నికల్లో ఒక్క సీటుకే పరిమితమైన జనసేన ఇప్పుడు బీజేపీతో కలిస్తే ఎన్ని సీట్లు అందుకుంటుంది, టిడిపితో జత కలిస్తే ఎన్ని స్థానాలు గెలుచుకుంటుంది? అయిష్టంతోనే కామ్రేడ్లు కూడా చేతులు కలిపారు. ఏపీ రాజకీయ ముఖచిత్రం మారుతుందని చెప్పిన జనసేన అధినేత ఆ దిశగా అడుగులు వేస్తున్నారా ? ఎట్టిపరిస్థితుల్లోనూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాకుండా చేస్తామంటున్న పవన్ మాటల వెనక ఉన్న ఆంతర్యం ఏంటి ? ప్రభుత్వ వ్యతిరేక ఓటుని చీలనివ్వమంటున్న పవన్ కల్యాణ్ రానున్న ఎన్నికల్లో ఎవరితో పొత్తు పెట్టుకుంటారు ? బీజేపీతో లాభమా టిడిపితో అధికారం సాధ్యమా ? అన్నదే ఇప్పుడు ప్రధాన అంశం.జనసేనకి బలమైన లీడర్ లేదన్నది ఆపార్టీకి కూడా తెలుసు. బూత్ మేనేజ్ మెంట్ మెంబర్లు కూడా లేదని స్వయంగా ఆపార్టీ అధినేత పవన్ కల్యాణే స్పష్టం చేశారు. అయితే రూట్ మ్యాప్ ఇవ్వని కారణంగా టిడిపితో కలిసి ముందుకు వెళ్లేందుకు నిర్ణయించానని ఇటీవలే జనసేన అధినేత ప్రకటించారు. ఈ భేటీ ముగిసిన కొద్దిరోజులకే విశాఖ పర్యటనలో ప్రధాని మోదీని కలిసి భవిష్యత్ బ్రహ్మాండంగా ఉంటుందని ఏపీ ప్రజలకు భరోసా ఇచ్చారు. దీంతో జనసేనానిని బీజేపీతో కలిసి వచ్చే ఎన్నికల్లో అడుగులు వేయబోతున్నారని కొందరు వాదించారు. అయితే టిడిపి–జనసేన– బీజేపీ కలిసి రంగంలోకి దిగుతాయని ఆ పార్టీ ఉమ్మడి సిఎం అభ్యర్థి పవన్ కల్యాణ్ అవుతారని కూడా వార్తలు వినిపించాయి పొత్తు లేకుండా ఒంటరిగా బరిలోకి దిగితే ఎక్కడెక్కడ గెలుస్తుంది అన్నది చర్చనీయాశంగా మారింది. ఒక్కొక్కరు ఎన్నికల పోరులోకి దిగినా, విపక్షాలన్నీ పొత్తులు పెట్టుకొని ఏకమైనా వైసీపీపార్టీని ఏం పీకలేరని ఇప్పటికే అధికారపార్టీ ధీమాతో చెబుతోంది. అందుకు కారణం ఈ లెక్కలేనంటున్నారు రాజకీయవిశ్లేషకులు. 175 సీట్లలో పోటీ చేసే సత్తా లేని పవన్ కల్యాణ్ మాటలు సినీ డైలాగులేనని ఇప్పటికే వైసీపీ నేతలు ఎద్దేవా చేస్తున్నారు. అంతేకాదు ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూస్తానమన్న పవన్ ఆశలన్నీ అడియాసలేనని వైసీపీ అధికాపార్టీ ప్రతినిధి సజ్జల కౌంటర్ ఇచ్చారు. స్టార్ హీరో కాబట్టి ఏదో ఏదో మాట్లాడుతాడని వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని చెబుతూ వచ్చే ఎన్నికల్లోనూ జగన్ దే గెలుపని, మళ్లీ భారీ మెజార్టీతో అధికారం అందుకుంటామని ఇప్పటికే మంత్రి రోజా జనసేన అధినేతకి కౌంటర్ ఇచ్చారు. మహేష్ బాబు సినిమాలోని డైలాగ్ ని నారా లోకేష్ కి అన్వయించి ఆయన చేపట్టబోయే పాదయాత్రపై సెటైర్లు వేశారు. అయితే ఎవరి లెక్కలు..ఎవరి అంచనాలు ఎలా ఉన్నా ఎన్నికల వేళ ఏ క్షణాన ఎవరి తలరాత మారుతుందన్నది చెప్పలేం కాబట్టి రానున్న ఎన్నికలో ఏపీ ప్రజలు ఎవరికి పట్టం కడతారన్నది తెలుసుకోవాలంటే మరో ఏడాదిన్నర ఆగాల్సిందే !

# కింగ్ మేకర్ గా పవన్...?



విజయవాడ, నవంబర్ 29, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు ప్రధాని మోదీతో సమావేశం తర్వాత ఒక స్పష్టత వచ్చినట్లు కనపడుతుంది. మోదీ ఆయనకు రాజకీయంగా ఏం సలహాలు ఇచ్చారో తెలియదు కాని, పవన్ కల్యాణ? లో మాత్రం మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. తనను ఈసారి ఆశీర్వదించాలని పదే పదే కోరుతున్నారు. గతంలో పవన్ కల్యాణ్ వైసీపీని వ్యతిరేకించేందుకు వ్యతిరేక ఓట్లను చీలనివ్వనని చెప్పిన పవన్ వాయిస్ లో ఛేంజ్ కనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరడమే కాకుండా తాను ఈసారి ఆచితూచి అడుగులు వేస్తానని చెప్పడం ఏపీ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. పవన్ కల్యాణ్ ను విశాఖపట్నంలో పోలీసులు అడ్డుకున్న తర్వాత విజయవాడలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ లు సమావేశమయ్యారు. ప్రజాసమస్యలపై అందరం కలసి పనిచేయాలని నిర్ణయించారు. ఇది జరిగి దాదాపు నెలన్నర రోజులవుతున్నా మళ్లీ ఇద్దరూ సమావేశం కాలేదు. పైగా విశాఖపట్నం పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ పవన్ కల్యాణ్ ను ప్రత్యేకంగా పిలిపించుకుని మాట్లాడిన తర్వాత కొంత మారినట్లు కనిపిస్తుంది. మోదీ పవన్ కు రూట్ మ్యాప్ ఇచ్చినట్లే అనిపిస్తుంది. అందుకే 2024, 2029 ఎన్నికలు కీలకమని కూడా ఈరోజు ఇప్పటం గ్రామస్థులతో జరిగిన సమావేశంలో పవన్ మాట్లాడారు. తెలుగుదేశం పార్టీని తొలుత రాజకీయంగా దెబ్బతీస్తే తనకు ఈ ఎన్నికలు కాకపోయినా, 2029 ఎన్నికల్లోనైనా ప్రజలు ఆదరిస్తారన్న నమ్మకంతో పవన్ ఉన్నారని అర్థమవుతుంది. చంద్రబాబు నాయకత్వానికి మద్దతు తెలిపేకంటే తాను స్వతహాగా పార్టీని బలోపేతం చేసుకుని ఎన్నికలకు సిద్ధమవ్వాలన్న ధోరణి ఆయనలో కనిపిస్తుంది. అందుకే ఆయన ఈరోజు సమావేశంలో కూడా తాను అడ్డదారులు తొక్కనని, అవినీతికి పాల్పడనని, పాల్పడనివ్వనని కూడా ప్రజలకు హామీ ఇస్తున్నారు. అంటే ఆయన ఈసారి బీజేపీతోనే కలసి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తుంది.. పదే పదే తాను అధికారంలోకి వస్తే అని చెప్పడం వెనక కూడా తానే ముఖ్యమంత్రి అభ్యర్థినన్న విషయాన్ని ఇటు మిత్రులవుదామనుకుంటున్న వారికి, ప్రత్యర్థులకు పవన్ సంకేతాలు పంపుతున్నట్లు అవగతమవుతుంది. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే 2029 ఎన్నికలకు మళ్లీ వైసీపీ పుంజుకునే అవకాశాలున్నాయని ఆయన అంచనాలో ఉన్నట్లుంది. అందుకే పవన్ కల్యాణ్ తాను ప్రత్యేకంగా వెళ్లాలనుకుంటున్నారు. 2024 ఎన్నికల్లో విడిగా పోటీ చేసి కీలకంగా మారితే టీడీపీ మద్దతుతో అయినా తాను అందలం ఎక్కవచ్చన్న భావన ఆయనలో కనిపిస్తుంది. మొత్తం మీద వైసీపీ మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూనే తాను కింగ్ మేకర్ గా మారాలన్న ఆలోచనలో ఆయన వెళుతున్నారన్నది అర్థమవుతుంది.

# పావురాల కోసం ఎంత శ్రద్ధో...

విజయవాడ, నవంబర్ 29, రెండంతస్తుల భవనం అంటే సాధారణంగా అందులో ఎన్నో కుటుంబాలు జీవనం సాగించటం కామన్ గా చూస్తుంటాం. కానీ కేవలం పావురాల కోసమే రెండంతస్తుల భవనాన్ని కేటాయించి వాటి బాగోగులు చూసుకుంటున్న వారు ఉంటారంటే ఆశ్చర్యం కలుగుతుంది. అవును ఇది నిజం. రెండంతస్తుల భవనంలో శబ్ధాలు చేసుకుంటూ, పాటలు వింటూ, ఫ్యాన్ కింద జీవనం సాగిస్తున్న పావురాల వివరాలపై మీరు ఒలుక్కేయండి.గన్నవరం సమీపంలోని మానికొండ గ్రామంలో ఉన్న ఈ రెండు అంతస్తుల భవనంలో కుటుంబాలు నివాసం ఉండటం లేదు. మనుషులు అసలు కనిపించరు. కేవలం పావురాలు మాత్రమే ఉంటాయి. సాధారణంగా రెండు అంతస్తుల భవనం అంటే కనీసం నాలుగు కుటుంబాలు నివాసం ఉండే అవకాశం ఉంది. కానీ ఈ భవనంలో మాత్రం పూర్తిగా పావురాలకు మాత్రమే ప్రత్యేకం. గత పది సంవత్సరాలకు పైగా ఈ భవనంలో పక్కాగా పావురాలను మాత్రమే పెంచుతున్నారు చెరుకువాడ శ్రీనివాసరావు అనే బిల్డర్. ఈ భవనంలో ఉంటున్న పావురాలకు మనుషులతో సమానంగా జీవనం సాగిస్తున్నాయి. ఉదయం లేచింది మెదలు రాత్రి పడుకునే వరకు పూర్తిగా స్వచ్ఛమైన గాలిని, నీరు, ఆహారం అందిస్తున్నారు. వేకువజామునే పావురాలు లేచింది మెదలు, వాటికి జొన్నలు, పెసలు, శనగలు, గోధుమలు, బఠాణీలు వంటి 15 రకాల ఆహారాన్ని అందిస్తారు. అంతే కాదు ప్రత్యేకంగా తాగునీటి సరఫరా ఉంటుంది. అది పూర్తిగా మెడికేటెడ్ వాటర్ కావటం మరో విశేషం.ఇక్కడ మరో ప్రత్యేకత కూడా ఉంది. పావురాల కోసం ప్రత్యేకించి మ్యూజిక్ సిస్టం ఏర్పాటు చేశారు. తెలుగు పాటలతో పాటుగా హిందీ, ఇంగ్లీష్ పాటలను పావురాల కోసం ప్లే చేస్తారు. మ్యూజిక్ ను వింటూ మేత తింటూ, పావురాలు విలాసవంతమయిన జీవనం గడుపుతున్నాయి. పక్షులు ఉండే ప్రాంతం అంటే పారిశుద్ధ్యానికి ఇబ్బందిగా ఉంటుంది, కాని ఇక్కడ మనుషులు ఉంటే ఎలాంటి హైజెనిక్ వాతావరణం ఏర్పరచుకుంటామో, అలాంటి వాతావరణమే ఉంటుంది. ఉదయం, సాయంత్రం పావురాలు ఉంటే ఫ్లోరింగ్ ను పూర్తిగా శానిటైజ్ చేస్తుంటారు. సాధారణంగా భవనంలో పావురాలను పెంచాలంటే ఆషామాషీ వ్యవహారం కాదు. వాటిని కాపాడుకోవటం ప్రదాన సమస్య. అనారోగ్య సమస్యలు లేకుండా జాగ్రత్తలు వహించాలి. సమయానికి ఆహారం, తాగునీరు, ఎంత ముఖ్యమో, అనారోగ్యం గురయినప్పుడు గుర్తించి మందులు వేయటం అంతే శ్రద్ద ఉండాలి. ఇందుకు ప్రత్యేకంగా ఒక మనిషిని శ్రీనివాసరావు నియమించారు. అతనే స్వయంగా పావురాలతో మమేకం అయ్యి, వాటి ఆలనా పాలనా చూసుకుంటున్నాడు. తాను చూసుకుంటున్న పావురాలు ఏ జాతికి చెందినవి, ఎలా ఉంటాయి, వాటిని కాపాడుకునే విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలను గురించి రాము గుక్క తిప్పుకోకుండా చెప్పేస్తున్నాడు. 150కి పైగా పావురాలను తమ వద్ద పెంచుతున్నామని అంటున్నాడు. పావురాలు అంటే తమకు ఉన్న ఇష్టంతోనే ఇలా ప్రత్యేకంగా పెంచుకుంటున్నామని తెలిపారు.దాదాపుగా 20 ఏళ్ళుగా పావురాలను పెంచుకుంటున్నామని, వాటి పై ఉన్న ప్రేమతోనే ప్రత్యేకంగా భవనాన్ని నిర్మించినట్లు చెరుకువాడ శ్రీనివాసరావు తెలిపారు. పావురాలకు గాలి, వెలుతురు కోసం భవనాన్ని డిజైన్ చేయించి నిర్మించినట్లు చెబుతున్నారు. పావురాలకు ఫీడింగ్ తో పాటుగా ఫ్యాన్, లైట్లు, మ్యూజిక్ సిస్టం ఏర్పాటు చేశామని చెప్పారు. దోమల నుంచి రక్షణ కోసం ప్రత్యేకంగా మెష్ ను ఏర్పాటు చేశామని, దశాబ్దాలుగా ఆలనాపాలనా చూస్తున్నామని తెలిపారు. ఆదాయం లేకపోయినా తమకు వచ్చిన ఇబ్బంది లేదని అంటున్నారు. చాలా మంది పక్షులను బంధిస్తున్నారంటూ మాట్లాడుతుంటారని, అయితే వీటిని బయటకు వదిలితే, పక్షులు, కాకులు పొడుచుకొని తినేస్తాయి కనుక వాటికి రక్షణగా ఉంటున్నామని శ్రీనివాసరావు వెల్లడించారు.

# మరో వివాదంలో దుర్గగుడి...

విజయవాడ, నవంబర్ 29, బెజవాడ దుర్గమ్మ ఆలయంలో మరో వివాదాం తెర మీదకు వచ్చింది. భక్తులు పవిత్రంగా భావించే లడ్డూలపై కూర్చొని శానిటేషన్ ఉద్యోగి ఒకరు ఫోన్ మాట్లాడటం వివాదానికి కారణం అయ్యింది. భక్తులు వారిస్తున్నప్పటికి అతను పట్టించుకోకపోవటంతో, ఫోటోలు తీసి అధికారులకు షేర్ చేశారు. ఆ ఫోటో ఇప్పుడు వైరల్‌గా మారింది..ప్రసాదం కోసం టిక్కెట్లు విక్రయించే కౌంటర్‌లో శానిటేషన్ ఉద్యోగి వచ్చి కూర్చోవటంపై వివాదం తలెత్తింది. ఉద్యోగి కూర్చున్నంత మాత్రాన వచ్చిన నష్టం ఏమీ లేదు కానీ అతను లడ్డూ ప్రసాదంపై కూర్చోవటం ఇప్పుడు వివాదానికి కారణమైంది. దీనిపై భక్తులు మండిపడుతున్నారు. కళ్ళార చూసిన భక్తులు ఉద్యోగిని వారించేందుకు ప్రయత్నించినప్పటికి అతను లైట్ తీసుకున్నాడు. పైగా భక్తులపైనే ఎదురు దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఎంతకీ ప్రసాదంపై కూర్చొని లేవకపోవంతో భక్తులు ఫోటోలు తీశారు. ఆ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. అమ్మ వారి ఆశీర్వాదం కోసం లక్షల మంది భక్తులు ఇంద్రకీలాద్రికి తరలి వస్తారు. కానుకలు, మొక్కుబడుల రూపంలో హుండీలో సమర్పించుకుంటారు. తీర్థప్రసాదాలు తీసుకొని తరిస్తారు. అయితే అమ్మ వారి ఖజానా నుంచి జీతాలు తీసుకునే కొంతమంది ఉద్యోగులు ఇష్టారీతిన వ్యవహరించటం చర్చనీయ అంశంగా మారుతోంది. అది కాస్త వైరల్ అయ్యింది.

అమ్మవారి ఆలయం పవిత్రతపై ప్రభావం చూపుతుండటం భక్తులను ఇబ్బందులకు గురి చేస్తుంది. భక్తులు ఎంతో పవిత్రమైన ప్రసాదంగా భావించే లడ్డూలపై కూర్చుని అపవిత్రం చేశారు. శానిటేషన్ విభాగంలో అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న సుధాకర్‌ను గతంలో కొండపై కేక్ కట్ చేసిన ఘటనలో ఈవో విధుల నుంచి పూర్తిగా తొలగించారు. తాజాగా మళ్లీ విధుల్లో చేరిన సుధాకర్ తీరు మార్చుకోకపోగా... అమ్మవారి భక్తుల మనోభావాలు అవమానించే విధంగా వ్యవహరించడం వివాదంగా మారింది. శానిటేషన్ విభాగంలో ఉండాల్సిన సుధాకర్ మూడు వందల రూపాయలు స్కానింగ్ సెంటర్‌లో తిష్ట వేశాడు. ఐదు వందలు టిక్కెట్లు ఇచ్చే కేంద్రంలో అక్కడ ఉన్న ప్రసాదాలపై కూర్చుని పెత్తనం సాగిస్తున్నాడు. తనకు సంబంధం లేకపోయినా భక్తులు పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదాలపై కూర్చున్న ఫొటో కూడా గ్రూపుల్లో హల్ చల్ చేస్తుంది. కౌంటర్‌లో విధుల్లో ఉండాల్సిన యన్.ఎం.ఆర్ ఉద్యోగి లేకుండా... సుధాకర్ ఆ విభాగంలో ఏం చేస్తున్నాడని చర్చ సాగుతుంది. ఒకసారి తొలగించిన సుధాకర్‌ను మళ్లీ ఎలా విధుల్లోకి తీసుకున్నారో కూడా ఎవరికీ అంతుబట్టడం లేదు. ఈవో స్వయంగా తొలగించినా.. మళ్లీ తీసుకురావడం వెనుక ఎవరి పాత్ర ఉందనే అంశంపైనా చర్చ నడుస్తుంది. భక్తులు లడ్డూ ప్రసాదాన్ని కళ్లకు అద్దుకుని మరీ స్వీకరిస్తారు. కానీ ఇలా లడ్డూల పై కూర్చుని, అవే లడ్డూలను ప్రసాదాలుగా ఐదు వందల టిక్కెట్టు కొన్న వారికి అందించడం భక్తులు మనోభావాలను దెబ్బతీయడమే అంటున్నారు అమ్మవారి సేవకులు. అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# చలికి కరిగిపోతున్న కొండలు

కర్నూలు, నవంబర్ 29, ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా అక్రమార్కులు చెలరేగి పోతున్నారు.పత్తికొండ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధితో ఒప్పందం కుదరడంతో పట్టపగలేతవ్వకాలు ప్రారంభించారు. ప్రైవేటు భూములతోపాటు ప్రభుత్వ భూముల్లోనూ దర్జాగా కొండను పిండి మట్టిని తోడేస్తున్నారు. డోన్ పట్టణం వెల్దుర్తి మండలంలో గత కొన్ని రోజులుగా సాగుతున్న దందా..పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి, రామళ్లకోటతదితర ప్రాంతాల పరిధిలో అనేక ఇనుప ఖనిజ నిల్వలున్నాయి. అక్రమార్కులు రామళ్లకోట ప్రాంతంలో సర్వే నంబరు 764లో గతేడాది భారీగా తవ్వకాలు చేపట్టారు. దానికి గాను అంధుకు సంబందించిన భూ యజమానికి కొంత నగదు ఇస్తూ అధికార పార్టీ నేతలకు కొన్ని మామూళ్లు ఇస్తూ యథేచ్ఛగాతవ్వకాలు సాగిస్తున్నారు.ఆ ప్రాంతంలో గ్రేడ్ –62 ఇనుప ఖనిజం ఉండటంతో కొండను పిండిచేస్తున్నారు. ఖనిజానికిమార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఆ నేత కన్ను వెల్దుర్తి , బనగానపల్లె తదితర ప్రాంతాలపై పడింది. మామూళ్లు వద్దు.. తానే ఆ ఖనిజాన్ని తవ్వుకుంటామని ఆ నేత హుకుం జారీ చేశారు. దీంతో ఇద్దరి మధ్య తేడాలు రావడంతో తవ్వకాలు నిలిచిపోయాయి.డోన్ పట్టణం పరిధిలో 2021–22 సంవత్సరం అటవీ సంపదను అధికార పార్టీ నేతలు అక్రమంగా తరలిస్తున్న పలు వాహనాలతోపాటు, తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాల్లో అధికారులు దాదాపు రూ.2.04 లక్షల విలువైన కనిజా సంపదను గుర్తించారు. తవ్వకాలు చేపట్టిన వారికి నామమాత్రంగా రూ 6 లక్షల వరకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఇందులో ఓ టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని రూ.1.05 లక్షల జరిమానా విధించిన్నట్లు తెలిపారు.అదే విదంగా నాలుగు ట్రాక్టర్లను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోగా, మూడు ట్రాక్టర్లలో ఐరన్ ఖనిజం మరియు రఫ్ స్టోన్ మొజాయిక్ చిప్స్ వంటివి తరలిస్తునట్లు అధికారులు గుర్తించారు. వీటికి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఇలా అనేక మార్లు పట్టుబడిన కొండలు తవ్వే రాబందులలో ఎలాంటి మార్పు రాకపోవడం గమనర్హం.ఇకనైనా అధికారులు ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుని కరిగే కొండలు ఆడవి సంపదను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

# లైబ్రరీకి పుస్తకాలు బహూకరించిన శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్



.నెల్లూరు, (నవంబర్ 29 మంగళవారం). శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు నగరంలోని సండే మార్కెట్ సెంటర్ దొడ్ల పద్మావతి శాఖ గ్రంధాలయానికి వివిధ రకాల పుస్తకాలను బాహూకరించారు. ఈసందర్భంగా గౌతమ బుద్ధుడు వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు అరవ రాయప్పమాట్లాడుతూ ఒక పాత చొక్కా అయినా తొడుక్కున్న పరవాలేదు, కానీ కొత్త పుస్తకం మాత్రం కొనుక్కోవాలి. ఒకే చోట వందలాది విషయాలపై వేలాది పుస్తకాలు కొలువుతీరి ఉండడం, విజ్ఞాన తృష్ణగల వారికి అది ఒక పవిత్ర స్థానమని తెలిపారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె. మురళీమోహన్ రాజు మాట్లాడుతూ గ్రంధాలయాలు నాగరిక సమాజానికి గుర్తులు. ప్రపంచంలో గొప్ప గొప్ప వాళ్ళందరూ పుస్తకాలు చదివి జ్ఞానాన్ని సంపాదించి, వారి వారి రంగాలలో రాణించి చరిత్రలో మిగిలి పోయారని వివరించారు. అనంతరం గ్రంధాలయానికి వివిధ రకాల 80 పుస్తకాలు అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రంధాలయ ఉద్యోగి పి.మంజుల, బి.సరళ, నెల్లూరు జిల్లా క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ట్రెజరర్ పెసల ధనుంజయ తదితరులు పాల్గొన్నారు

# తూర్పు టీడీపీలో లుకలుకలు

రాజమండ్రి, నవంబర్ 29, ఏపీలో టీడీపీ నేతల మధ్య చీలకలు బయటపడుతున్నాయి. అయితే.. తాజాగా తూర్పు గోదావరి జిల్లా టీడీపీలో చీలికలు బయటపడ్డాయి. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు డిసెంబరు 1న తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు పర్యటనకు వస్తుండగా, పార్టీలో అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. కొవ్వూరులో చంద్రబాబు పర్యటించడంతో పాటు బహిరంగ సభలోనూ పాల్గొంటారు. పార్టీ అధినేత వస్తున్న నేపథ్యంలో, కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ నేతలు సమావేశం నిర్వహించారు. గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో ఇద్దరు సభ్యుల కమిటీ సమావేశమైంది.ఈ కమిటీలో సుబ్బరాయచౌదరి, రామకృష్ణ సభ్యులుగా ఉన్నారు. అయితే, ఇద్దరు సభ్యుల కమిటీ సభా వేదికపైకి వచ్చేవారి జాబితాలో మాజీ మంత్రి జవహర్ పేరు చేర్చకపోవడం ఆయన వర్గీయులను ఆగ్రహానికి గురిచేసింది. జవహర్ ను కూడా వేదికపైకి పిలవాలని ఆయన వర్గం డిమాండ్ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ మంత్రి జవహర్, ఇద్దరు సభ్యుల కమిటీ వర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. ఈ ఘటనతో గోరంట్ల బుచ్చయ్యచౌదరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

# అనంతలో త్యాగయ్య లు ఎవరు

అనంతపురం, నవంబర్ 29, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఈసారి ఆచితూచి టిక్కెట్ల విషయంలో నిర్ణయం తీసుకుంటారు. ఇప్పటికే ఒక కుటుంబానికి ఒకే టిక్కెట్ అని ఒక విధానాన్ని పెట్టుకున్నారు. అన్ని చోట్ల ఆ విధానం వర్తించక పోవచ్చు. కొందరి విషయంలో మినహాయింపు లభించవచ్చు. అలాగని అందరికీ మినహాయింపు ఇచ్చే అవకాశాలు లేవు. ఎందుకంటే రెండు చోట్ల కుటుంబ సభ్యులు పోటీ ఉంటే ప్రత్యర్థులు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒక నియోజకవర్గం పైన పట్టు సాధించలేకపోవచ్చు. ఖర్చు విషయంలో కూడా వెనక్కు తగ్గవచ్చు. అందుకే చంద్రబాబు ఒకే కుటుంబానికి ఒకే టిక్కెట్ అని విధాన నిర్ణయంగా ప్రకటించారు. రాయలసీమలోని కర్నూలు జిల్లాలో కేఈ బ్రదర్స్ కు కూడా ఇది వర్తిస్తుందని పరోక్షంగా చెప్పారు. ఇక ఉమ్మడి అనంతపురం జిల్లా విషయానికి వస్తే పరిటాల కుటుంబానికి ప్రత్యేకత ఉంది. తెలుగుదేశం పార్టీకి నమ్మకమైన కుటుంబంగా పేరొన్న పరిటాల ఫ్యామిలీకి ఈసారి రెండు టిక్కెట్లు ఇస్తారా? లేదా? అన్నది చర్చనీయాంశమైంది. ఈసారి టీడీపీకి ప్రతి సీటు కీలకమైనదే. గత ఎన్నికల్లోనూ పరిటాల కుటుంబానికి ఒక టిక్కెట్ మాత్రమే కేటాయించారు. రాప్తాడులో పరిటాల శ్రీరామ్ బరిలోకి దిగారు. అయితే వైసీపీ నేత తోపుదర్తి ప్రకాష్ రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. కానీ ఈసారి పరిటాల సునీతకు రాప్తాడు సీటు ఇవ్వాలన్నది చంద్రబాబు నిర్ణయంగా తెలుస్తోంది. ఆ కుటుంబం ఒప్పుకున్నా, అభ్యంతరం వ్యక్తం చేసినా రాప్తాడు నుంచి సునీతను మాత్రమే పోటీ చేయించాలని చంద్రబాబు భావిస్తున్నారు. సునీత అయితేనే రాప్తాడులో గెలుపు అవకాశాలున్నాయని టీడీపీ అధినేత అంచనాగా ఉంది. అవసరమైతే పరిటాల శ్రీరామ్ కు పార్టీ పదవిని ఇవ్వాలని భావిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఏదో ఒక నామినేటెడ్ పదవి అయినా ఇవ్వవచ్చన్నది సీనియర్ నేతలు పరిటాల కుటుంబాన్ని నచ్చ చెబుతున్నారని తెలిసింది. అయితే పరిటాల శ్రీరామ్ మాత్రం ధర్మవరం నియోజకవర్గంపై ఆశలు పెంచుకున్నారు. ధర్మవరం టిక్కెట్ శ్రీరామ్ కు ఇస్తే రాప్తాడులో కూడా నష్టం జరిగే అవకాశముందని భావిస్తున్నారు. అందుకే ధర్మవరంలో మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరికి టిక్కెట్ ఇచ్చే అవకాశాలున్నాయి. ఆయన ప్రస్తుతం బీజేపీలో ఉన్నా ఎన్నికల నాటికి టీడీపీలోకి వస్తారని, ఆయనకే ఈ టిక్కెట్ ను పెద్దాయన రిజర్వ్ చేసి ఉంచారని చెబుతున్నారు. గెలుపు కోసం కొన్ని సీట్లను త్యాగం చేయక తప్పదని చంద్రబాబు సూచిస్తున్నారు. ధర్మవరం సీటు తనకు దక్కకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరిన పరిటాల శ్రీరామ్ ను చల్లబరిచి రాప్తాడుకే ఆ కుటుంబాన్ని పరిమితం చేయాలన్నది చంద్రబాబు ఆలోచన. శ్రీరామ్ ధర్మవరానికి ఇన్‌ఛార్జిగా ఉన్నప్పటికీ ఈసారికి మాత్రం త్యాగం చేయక తప్పదన్న సంకేతాలు మాత్రం బలంగా కనిపిస్తున్నాయి.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నెల్లూరు నెల్లూరు జిల్లా దగదర్తి మండలం సున్నపు బట్టి జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక కంటైనర్ లారీ ముందు పోతున్న ఆటోను డీ కొట్టింది. ఆ సమయంలో ఆటోలో 18మంది భవాని స్వాములు ప్రయాణిస్తున్నారు. వారిలో ఇద్దరు మృతి చెందారు. ఐదుమందికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను కావలి ఏరియా హాస్పిటల్ కు తరలించారు. వీరందరూ అల్లూరు మండలం సింగపేట పంచాయితీ చెలిక సంఘం గ్రామానికి చెందినవారు. కోవూరులో భజన కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెల్తుండగా ఘటన చోటుచేసుకుంది.

# తల్లి పిల్లలనుకాపాడిన రైల్వే కీ మాన్

కాకినాడ కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ రైల్వే గేటు వద్ద తల్లి ఇద్దరు పిల్లలను రైల్వే కీమాన్ కాపాడాడు. విశాఖపట్నం-విజయవాడ సూపర్ పాస్ట్ రైలు వస్తున్న ట్రాక్ పై తల్లి ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకునేందుకు ఎదురుగా వెళ్లారు. ట్రైన్ క్రింద పడి ఇద్దరు పిల్లలతో ఆత్మహత్య కు యత్నించిన మహిళను గమనించిన రైల్వే కీమాన్ పిడిమి వెంకటేశ్వరావు, పరుగున వెళ్ళి తల్లి పిల్లలను ప్రక్కకు లాగి వారిని రక్షించాడు. తరువాత 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పిఠాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తల్లీపిల్లలను తీసుకుని కాకినాడ దిశా పోలీస్ స్టేషన్ కి అప్పగించారు. వారికి పోలీసులు కాకినాడ దిశ పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ ఇచ్చి, ధైర్యం చెప్పి పుట్టింటి వారికి అప్పగించారు. బాధితురాలు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒక గ్రామానికి చెందిన మహిళగా గుర్తించారు. భర్తతో గొడవ పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడించింది. తల్లి ఇద్దరు పిల్లల్ని కాపాడిన రైల్వే కీమాన్ పిడిమి వెంకటేశ్వరావుని పోలీసులు,స్థానికులు అభినందించారు.

# మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్ లోకి దాడి, కొణతాల

విశాఖపట్టణం, నవంబర్ 29,కప్పుడు ఆ మాజీ మంత్రి చుట్టూ పవర్ పాలిటిక్స్ తిరిగేవి. రాజకీయాల్లో ఎంత ఎత్తుకు ఎదిగారో.. అన్ని ఎదురు దెబ్బలు తిన్నారు. ఇప్పుడు ఒక్కఛాన్స్ దొరికితే పూర్వ వైభవం సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. రాజకీయ వనవాసం వీడే సంకేతాలు కనిపిస్తున్నట్టు లెక్కలేస్తున్నారట.ఉమ్మడి విశాఖ జిల్లాలో అనకాపల్లి రాజకీయాలు ఎప్పుడు ప్రత్యేకమే. హోరా హోరీ పోటీకి కేరాఫ్ అడ్రసైన ఈ నియోజకవర్గంలో సుదీర్ఘకాలం మాజీ మంత్రులు కొణతాల రామకృష్ణ, దాడి వీరభద్రరావు రాజకీయ ఆధిపత్యం కోసం పోరాడారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా,మంత్రిగా, శాసనమండలి ప్రతిపక్షనేతగా పని చేసిన అనుభవం వీరభద్రరావుది. ప్రస్తుతం వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. కొన్నేళ్లుగా రాజకీయ గ్రహణం పట్టుకుంది. 2014లో విశాఖ పశ్చిమలో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు దాడి కుమారుడు రత్నాకర్. తన బలం, స్థాన బలం లేనిచోట చేసిన ఆ ప్రయోగం విఫలమై.. సీనియర్ నేత బలహీనత బయటపడింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినా పోటీచేసే అవకాశం లభించలేదు. ఇంతలో అనకాపల్లిలో ఈక్వేషన్లు మారిపోయాయి.అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్ ప్రస్తుతం రాష్ట్ర మంత్రి. ఇక్కడ మంత్రికి.. మాజీ మంత్రికి రాజకీయ వైరం పెరిగిపోయింది. దీనికి తోడు పశ్చిమలో ఓటమి తర్వాత వైసీపీ అధినాయకత్వంతో విభేదించింది దాడి కుటుంబం. అందుకే 2019లో టికెట్ రాలేదని చెబుతారు. రాజకీయ కప్పదాటు వైఖరితో అనకాపల్లి సీటు వదులు కోవాల్సి వచ్చిందనే విమర్శలు దాడి కుటుంబం ఎదుర్కొంది. వైసీపీలో తిరిగి చేరినప్పుడే కుమారుడు రత్నాకర్‌కు రాజకీయ భవిష్యత్ కల్పించమని అధినాయకుడిని కోరారు దాడి. అందుకు సమ్మతించిన హైకమాండ్ పార్టీ బాధ్యతలు తండ్రికి, పొలిటికల్ కెరీర్ రత్నాకర్‌కు కల్పిస్తారనే ప్రచారం జరిగింది. ఈ తరుణంలో నామినేటెడ్ పోస్టులు ఆఫర్ చేసినా.. రాజకీయంగా తమస్థాయికి సరిపడవనే కారణాలతో వాటిని వదులుకుంది దాడి కుటుంబం. వీటిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, సింహాచలం ట్రస్ట్ బోర్డు మెంబర్ వంటివి ఉన్నాయి.ఎమ్మెల్యే టికెట్ తప్ప మరే పదవులు తీసుకోరాదనే ఆలోచనలో ఉన్న వీరభద్రరావు మూడున్నరేళ్లుగా క్రియాశీల రాజకీయాలకు దూరం అయ్యారు. అది మంత్రి అమర్నాథ్ వర్గానికి కలిసొచ్చింది. అనకాపల్లిలో తన వర్గాన్ని కాపాడుకోవడం, వ్యూహాత్మకంగా పాచికలు వెయ్యడం తప్ప మెయిన్ స్ట్రీమ్‌లోకి వచ్చే ఛాన్స్ దాడికి లేకుండా పోయింది. సీఎం పర్యటనలకు వచ్చినప్పుడో.. కీలక సమావేశాల నిర్వహించే సందర్భంలో తప్ప వీరభద్రరావు కానీ ఆయన తనయుడు కానీ చురుకుగా వ్యవహరించడం లేదు. వచ్చే ఎన్నికల్లో తమకు పోటీ చేసే అవకాశం లభిస్తుందా.. లేదా అనే మీమాంశ మరో కారణం. సిట్టింగ్ సీటును.. అందునా మంత్రిని నియోజకవర్గం ఖాళీ చేయించి తమకు ఇస్తారనే అంచనాలు ఏ కోశాన లేకపోవడమే దాడి ఫ్యామిలీ సైలెన్స్ వెనుక మరో కారణంగా భావిస్తున్నారు.మాస్టారు కెరీర్ ముగిసిందని ప్రత్యర్థులు అంచనా వేసుకుంటున్న సమయంలో.. మాజీ మంత్రికి మరోసారి కాలం కలిసి వచ్చే సంకేతాలు కనిపిస్తున్నట్టు చర్చ మొదలైంది.

దాడికి హైకమాండ్ దగ్గర ప్రాధాన్యం ఎంత ఉందనే దానికంటే సిట్టింగ్ సీటు దాదాపు ఖాళీ అవుతుందనే ఊహాగానాలే ఆ చర్చకు కారణం. అనకాపల్లిలో మంత్రి అమర్నాథ్ తిరిగి పోటీ చెయ్యబోరనే ప్రచారం కొన్ని నెలలుగా జరుగుతోంది. పొరుగునే ఉన్న యలమంచిలి వ్యవహారాల్లో అమర్నాథ్ పరోక్షంగా ఆసక్తిని కనబరుస్తున్నారు. దీనికితోడు అనకాపల్లిలో తిరిగి పట్టు సాధించాలంటే బలమైన గవర సామాజికవర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం.. కాపు ఓట్ బ్యాంక్ అధికంగా ఉన్నందున ఆ వర్గాన్ని దగ్గర చేసుకోవడం అనివార్యమనే వాదన వైసీపీలో ఉంది. టీడీపీ, జనసేన బలాలను, బలహీనతలను అంచనా వేశాక.. దాడి కుటుంబానికి ఛాన్స్ ఇస్తే సానుకూలంగా ఉండొచ్చనే వాదన ఉందట.గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని దాడికి అవకాశం కల్పిస్తుందా.. లేక కొత్త ముఖాన్ని తెరపైకి తెస్తుందా అనేది ప్రస్తుతానికి ఒక చర్చ. మంత్రి అమర్నాథ్ సిట్టింగ్ సీటును కోరుకున్నా.. గతంలో మాజీ మంత్రి ప్రదర్శించిన దూకుడిని హైకమాండ్ మర్చిపోకపోయినా మరోసారి నిరాశ తప్పకపోవచ్చు. అదే జరిగితే అనకాపల్లి రాజకీయాల్లో ఒక విధంగా ఉమ్మడి విశాఖ హిస్టరీలోనే మరుగునపడ్డ మరో కుటుంబం అవుతుందనే ఆందోళన దాడి సన్నిహితులు, వర్గీయుల్లో నెలకొందట. అలాగని తొందరపడి ఎటువంటి రిస్క్ తీసుకోలేని పరిస్థితి. మరి కాలపరీక్ష నుంచి మాజీ మంత్రి ఫ్యామిలీ ఏ విధంగా గట్టెక్కుతుందో చూడాలి.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సమాచార శాఖ మంత్రి

తిరుమల, నవంబర్ 29 తిరుమల శ్రీవారిని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ, సినిమాటోగ్రఫీ, వెనుక బడిన తరగతుల శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ ప్రాతః కాల సేవలో స్వామి వారిని కుటుంబ సమేతంగా సేవించి దర్శించుకున్నారు.స్వామి వారి దర్శన అనంతరం ఆలయ వెలుపల మీడియా తో మంత్రి మాట్లాడుతూ ముందుగా ఓం నమో వెంకటేశాయ వెంకటాద్రి సమస్తానం బ్రహ్మాణ్డె నాస్తి కించనః వెంకటేశ సమోదేవో నభూతో నభవిష్యతి అని స్వామి వారిని స్మరిస్తూ ఈ రోజు పెరుమాళ్ళి స్వామివారిని ప్రాతఃకాల సేవలో సేవించి, తాను ప్రధానంగా వేడుకున్నది కోరుకున్నది ఏమంటే అంటూ ఈ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రభుత్వం పాలనలోకి వచ్చాక ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని ఇది ప్రజలు మెచ్చిన ప్రభుత్వమని అన్నారు. గౌ ముఖ్యమంత్రి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలు సుస్థిరమైన జీవనాన్ని సాగించే దిశగా పాలన అందిస్తున్నారని పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పేదవారి గడపకు పాలన అందించడమే లక్ష్యంగా పేదల


## ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన రెడ్డిని అనుగ్రహించమని కోరుకున్నా

సంక్షేమం అభివృద్ధి దిశగా ఈ ప్రభుత్వం పనిచేస్తోందని, గతంలో మాటలే కానీ చేతలు లేవనీ ఈ ప్రభుత్వం చేతలే కానీ మాటలు కాదని అన్నారు. ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడుతున్న జగన్మోహన్ రెడ్డి పాలనపై కొంత మంది దురుద్దేశంతో కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారనీ వాటన్నింటినీ విఫలం చేయమని, ధర్మం కాపాడుతూ న్యాయస్థానాలు పనిచేస్తున్నాయని, ఏ సత్సంకల్పంతో అయితే స్వామి ఆశీస్సులతో పాలకుడైనటువంటి జగన్ మోహన్ రెడ్డి గారిని మరింతగా అనుగ్రహించమని, వారి మంచి ఆలోచనలు సిద్ధించాలని ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రజల కష్టాలని తొలగించాలని, అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి మీద సంపూర్ణ అనుగ్రహాన్ని ప్రసాదించమని స్వామి వారిని వేడుకున్నానని తెలిపారు.

# డిసెంబరు 6 నుండి బ్రౌన్ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా స్థాయిలో విద్యార్థులకు పోటీలు

కడప కల్చరల్ నవంబర్ 29: (ఉదయం న్యూస్)యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సి.పి.బ్రౌన్ 139వ వర్ధంతి (డిసెంబర్ 12) సందర్భంగా డిసెంబరు 6 నుండి నుండి బ్రౌన్ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బాధ్యులు డా.మూల మల్లికార్జున రెడ్డి తెలియజేశారు. ఈ వారోత్సవాలు 6 వతేదీ నుండి 12 వరకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించబడతాయన్నారు . 6వ తరగతి నుండి పి.జి.విద్యార్థుల వరకు జిల్లాస్థాయిలో అనేక పోటీలు నిర్వహించబడతాయి కార్యక్రమ వివరాలు 6 న మంగళవారం ప్రారంభ సమావేశం ఉదయం 9-00 గం లకు నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మునగల సూర్యకళావతి, అధ్యక్షులుగా కులసచివులు ఆచార్య దుర్భాక విజయ రాఘవ ప్రసాద్, విశిష్ట అతిథిగా విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, గౌరవ అతిథిగా వాణిజ్య విభాగం అధ్యాపకులు ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి పాల్గొంటారు.6,7,8 తరగతుల విద్యార్థులకు 'పద్య పఠన పోటీ' ఉంటుంది. పఠన సమయం : 5 ని లు. అంశం : వేమన, సుమతి శతకాలలోని 6 పద్యాలు (ప్రతి శతకం నుండి మూడు పద్యాలు ఉండాలి) 7వతేదీ బుధవారం ఉదయం 9-00 గం లకు 9,10 తరగతులు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు 'వక్తృత్వం' పోటీ ఉంటుంది. వ్యవధి : 5 ని లు వైయస్సార్ కడప జిల్లా ప్రముఖులు (9,10 తరగతుల విద్యార్థులకు) . వైయస్సార్ కడప జిల్లా పర్యాటక ప్రాంతాలు అనే అంశాలు ఉంటాయన్నారు (ఇంటర్మీడియట్ విద్యార్థులకు)8 న గురువారం ఉదయం 9-00 గం లకు 3,4,5 తరగతులు ఇంటర్మీడియట్ నుండి పి.జి.విద్యార్థులకు 'చిత్రలేఖనం' పోటీ నిర్వహించబడుతుంది. లేఖన సమయం : 1-30 గంట. నచ్చిన చిత్రం (3,4,5 తరగతుల విద్యార్థులకు) . మన సంస్కృతి (ఇంటర్మీడియట్ నుండి పి.జి. విద్యార్థులకు) 9న శుక్రవారం ఉదయం 9-00 గం లకు 8,9,10 తరగతుల విద్యార్థులకు 'ధారణ పరీక్ష' ఉంటుంది. వ్యవధి:5 ని లుఅంశం : హిందూ, ఇస్లాం, క్రైస్తవ గ్రంథాలలోని విషయాలు 10 నా శనివారం ఉదయం 9-00 గం లకు 8,9,10 తరగతుల విద్యార్థులకు 'కథా పూరణం' ఉంటుంది. పూరణ వ్యవధి : 1 గంట 11న ఆదివారంఉదయం 9-00 గం లకు 8,9,10 తరగతుల విద్యార్థులకు 'క్విజ్' ఉంటుంది. సమయం : 1 గంటఅంశం : వైయస్సార్ కడపజిల్లా చరిత్ర, సంస్కృతి,సామాజికఅంశాలు12 న సోమవారం ముగింపు సమావేశం ఉదయం 10-00గంలకునిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మునగల సూర్యకళావతి, విశిష్ట అతిథిగా కులసచివులు ఆచార్య దుర్భాక విజయ రాఘవ ప్రసాద్, అధ్యక్షులుగా విశ్వవిద్యాలయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్‌లు విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారని చెప్పారు . కార్యక్రమాన్ని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులు డా. మూల మల్లికార్జునరెడ్డినిర్వహిస్తారుమరిన్నివివరాలకోసం9966624276,9440859872, 9494077736 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు

# సాక్షి ఎక్సెలెన్సీ అవార్డు గ్రహీత సహదేవయ్యకు ఘన సన్మానం




.నెల్లూరు.. గవర్నర్ విశ్వ భూషణ్ చేతులమీదుగా సాక్షి ఎక్సెలెన్సీ అవార్డును అందుకున్న సహదేవయ్యకి ఘన సన్మానం కార్యక్రమం జరిగింది. నెల్లూరు గ్రామీణ మండల పరిధిలోని పొదలకూరు రోడ్డు, పిండిమిల్లు సెంటర్ వద్ద ఉన్న నవజీవన్ ఆర్గనైజేషన్ కార్యాలయం నందు నవజీవన్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కాలువపల్లి సహదేవయ్యకి సాక్షి ఎక్సలెన్సీ అవార్డును గవర్నర్ విశ్వభూషన్ చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ మరియు పి.ఎం.పి అసోసియేషన్, ఏపీయూడబ్ల్యూజే, ఫోటోగ్రఫీ అసోసియేషన్, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగినది. ఈకార్యక్రమములో జీవో ఎన్జీవో నోడల్ అధికారి ఏ.మహేంద్ర రెడ్డి, పీఎంపీ గౌరవఅధ్యక్షులు అనుమల జయప్రకాష్ , రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, పీఎంపీ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, డివిజన్ అధ్యక్షులు గోరంట్ల శేషయ్య, ఫోటోగ్రఫీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీధర్, చైల్డ్ షెపర్డ్ సంస్థ అధ్యక్షురాలు నూర్జహాన్ బేగం గారు, టీచర్ సుబహాన్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీస్ యునైటెడ్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు కుడుముల సుబ్బారావు , శ్రీమన్నారాయణ రాజేష్, మన్సూర్, బిందు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కూలీల కంట కన్నీరు

అనంతపురం, నవంబర్ 29, రోజు రోజుకు పతనం అవుతున్న టమోటా ధరలను చూసి రైతులు ఆవేదన చెందుతున్నారు. అనంతపురం జిల్లా లోని కక్కలపల్లి రోడ్డులో గల టమోటా మార్కెట్లో రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. కనీస ధర లేక రైతు లు ఇబ్బంది పడుతున్నారు. ఒక బాక్స్ 80 రూపాయలు కూడా ధర లేదని రైతులు వాపోతున్నారు. మార్కెట్ కి తరలించడానికి సగం డబ్బు ఖర్చు అవుతుందని చెబుతున్నారు. రవాణా ఖర్చు, కమిషన్ మరియు ఇతర ఖర్చులు పోయి కనీసం పెట్టుబడి కూడా రాలేదని తెలుపుతున్నారు.గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు. వ్యవసాయం చేసి కనీసం పెట్టుబడి కూడా రాకుండా పోతే మేము ఆత్మహత్య చేసుకోవడమే శరణ్యమని రైతులు తెలుపుతున్నారు. చేతికందిన పంట వర్షం వల్ల మొత్తం నేల రాలి పోయిందని కనీసం మార్కెట్కూ కు తీసుకురావడానికి సరిపడా టమోట లేదని చెబుతున్నారు. కనీసం తీసుకువచ్చిన టమోటా కూడా సరిగా గిట్టుబాటు ధర లభించక పోవడంతో వారు చాలా ఆవేదన చెందుతున్నారు.నాణ్యమైన టమోటా కూడా 150 రూపాయలకు మించి ధర పెరగడం లేదని రైతులు తెలుపుతున్నారు.పొలంలో టమోటా తీయడానికి వచ్చిన కూలీల ఖర్చు కూడా చాలా ఎక్కువగా ఉందని ఆందోళన చెందుతున్నారు.మార్కెట్ లో వచ్చే డబ్బు సరిపోవడం లేదని పేర్కొన్నారు,గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు

# అభ్యుదయ కవితా పితామహుడు 'గురజాడ అప్పారావు'

-నేడు ఆయన వర్ధంతి





'ప్రాచీనత', 'ఆధునికత' సంధియుగంలో జన్మించాడు గురజాడ అప్పారావు.తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి గురజాడ. నేడు కవి శేఖరడి వర్ధంతి . విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో 1862 సెప్టెంబర్ 21 అప్పారావు జన్మించాడు. తండ్రి వెంకట రామదాసు, తల్లి కౌసల్యమ్మ. 20 వ శతాబ్ది మొదటి దశకంలోనూ ఆయన చేసిన రచనలు ఈనాటికీ ప్రజల మన్ననలను పొందుతున్నాయి. ప్రజలందరికీ అర్ధమయ్యే జీవ భాషలో రచనలు చేసారు. వీరి కన్యాశుల్కము నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ నాటకంలో ఆయన సృష్టించిన గిరీశం, మధురవాణి, రామప్ప పంతులు మొదలైన పాత్రలు ప్రఖ్యాతి పొందాయి. ఉపాధ్యాయుడిగానూ, డిప్యుటీ కలెక్టర్ ఆఫీసులో హెడ్‌క్లర్కుగానూ, విజయనగరం రాజు ఆస్థానంలోనూ, అధ్యాపకుడిగానూ పనిచేసిన గురజాడ- తొలుత ఆంగ్లంలో రాసినప్పటికీ, తర్వాత తెలుగులోకి మరలాడు. స్నేహితుడు గిడుగు రామ్మూర్తితో కలిసి వ్యావహారిక భాషోద్యమానికి నడుం బిగించాడు. విజయనగర కేంద్రంగా జరిగే 'కన్యాశుల్కము' నాటకంలో అక్కడి యాస భాషను ప్రవేశపెట్టాడు. పెద్ద కుటుంబాలనుంచి వచ్చినవారే నాయికానాయకులుగా సాహిత్యాన్ని ఆక్రమించుకుంటున్న కాలంలో వేశ్య మధురవాణిని నాయికను చేశాడు. వేశ్యావృత్తిని నిర్మూలించాలంటే, ముందుగా వేశ్యలను కూడా మనుషులుగా చూడటం అవసరమన్నాడు. గురజాడ. 20వ శతాబ్ది తొలినాళ్ళలో జరిగిన వ్యవహారిక భాషోద్యమంలో గురజాడ అప్పారావు తన సహాధ్యాయి గిడుగు రామమూర్తి పంతులుతో కలిసి పోరాటం జరిపారు. వారిద్దరూ కలిసి పత్రికల్లో, సభల్లో, మద్రాసు విశ్వవిద్యాలయంలో గ్రాంథిక భాషావాదులతో పోరాడారు. 1913లో అప్పారావు పదవీ విరమణ చేసారు. 1915 నవంబర్ 30 న గురజాడ అప్పారావు మరణించారు.

# వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ఎంపిక.

## బుచ్చినాయుడు

కండ్రిగ నవంబర్ 29(ఉదయం న్యూస్):మండలంలోని మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభలు జరిగినవి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దబాల సుబ్బారావు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆయన నూతన వ్యవసాయ కార్మిక సంఘం కమిటీని ఏర్పాటు చేయడం జరిగినదివ్యవసాయ కార్మిక సంఘం నూతన అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిగా రమణయ్య బాలకృష్ణ ఎన్నికఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభలు తిరుపతి జిల్లాలోని బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ నందు జరిగింది. ఈ మహాసభలో నూతన కమిటీని 17 మందితో ఎన్నుకోవడం జరిగింది. 7 మంది ఆఫీస్ బేరర్స్ గా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి 600 రూపాయలు కూలి పెంచాలని, పేదలకు భూములు పంచాలని, గ్రామాలలో విద్యా వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని, మధ్య నియంత్రణ చేయాలని, డీకేటి భూములను రక్షించాలని, వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం తీసుకురావాలని పలు తీర్మానాలు ఆమోదించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వందవాసి నాగరాజు ఎన్నికైన నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా రమణయ్యజిల్లా ప్రధాన కార్యదర్శిగా టి బాలకృష్ణఉపాధ్యక్షులు వందవాసి నాగరాజుకలపాటి గురవమ్మ, ముత్యాలయ్య సహాయ కార్యదర్శులుగా అముదా, రాజగోపాల్ ఎన్నికైనట్టు ప్రకటించారు.



## గ్రామ కంఠం స్థలాల పై అవగాహన సదస్సు





నంద్యాల :-నంద్యాల జిల్లా లో మంగళవారం నాడు ఆర్ ఎ ఆర్ యస్ సమావేశ భవనము నందు శ్రీమతి టి.నిశాంతి, సంయుక్త కలెక్టరు, నంద్యాల గారి అధ్యక్షతన "జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం" లో భాగంగా సంబందిత అధికారులకు అవగాహన కల్పించుటకు శిక్షణా కార్యక్రమము ను నిర్వహించడం జరిగినది. సదరు శిక్షణా కార్యక్రమమునకు, జిల్లా యందలి, ఆర్డీవోలు. డిజి పీఓ. అసిస్టెంట్ డైరెక్టర్ సర్వేయర్. డీఐ పీఓ యస్. తాసిల్దార్లు. డిప్యూటీ తహసీల్దార్లు. మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్లు., మండల సర్వేయర్లు. పంచాయతీ సెక్రెటరీలు. విలేజి సర్వే యర్లు , పాల్గొన్నారు. సదరు శిక్షణా లో ప్రభుత్వ ప్రైవేటు గ్రామ కంఠం మొదలైన స్థలాల పై వచ్చు సమస్యలను పరిష్కరించుటకు అనుభాజ్ఞులైన అధికారుల చే అవగాన కల్పించినారు.

## స్థలాల కబ్జాదారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం

కౌతాళం :స్థలాల కబ్జాదారుల కు కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రాలయం నియోజకవర్గ జనసేన మండల నాయకులు రమంజి నేయులు సబ్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూకౌతాళం మండలం లోని వైయస్సార్ కాలనీలో 285 ఇళ్ల స్థలాల పట్టాలు ఉండగా సర్వేనెంబర్ 249/ ః3ం గల ఉన్న ఓపెన్ సైట్ 40 సెంట్లు స్థలాన్ని ప్రభుత్వ అధికారులు సచివాలయం, అంగన్వాడి కేంద్రాలకు మరియు ఆర్.బి.కె గోడను నిర్మించడానికి కేటాయించడం జరిగిందని కానీ కొంతమంది అక్రమార్కులు ఆ స్థలాన్ని ఆక్రమించడం జరిగిందిని పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చినటువంటి సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ జనసేన మండల నాయకుడు రామాంజనేయులు స్థలాల కబ్జాలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. సబ్ కలెక్టర్ స్పందిస్తూ ఓపెన్ సైట్ కబ్జా చేసిన వారిని విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో చంద్రశేఖర్ వర్మ కి ఆదేశించడం జరిగింది. జనసేన మండల నాయకులు రామాంజనేయులు, సిద్ధాప్ప పాల్గొన్నారు

# రైతునగరం ఏరియాలో విచ్చలవిడిగా ఇళ్ల నిర్మాణాలు



**దాదాపు 8 సంవత్సరాలు అవుతున్న కూడా ఇంటి పన్నులు కటించుకోకపోవడం రైతు నగరం గ్రామ సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం**

**రైతునగర్ సచివాలయ సిబ్బంది పన్నులు కటించుకోకపోవడం నిర్లక్ష్యం విడాలి.**

**ప్రభుత్వ సొమ్మును వృధా చేస్తున్న రైతునగర్ గ్రామ సచివాలయ సిబ్బంది ఇళ్ల నిర్మాణం పూర్తి అయిన వెంటనే వాటికి సంబంధించిన గవర్నమెంట్ సిబ్బంది వాటిని గుర్తించి వాటికి పన్నులు చెల్లించి గవర్నమెంట్ కు ఆదాయం పెంచాలి .బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంకిరి రామచంద్రుడు డిమాండ్**

నంద్యాల నవంబర్ 29 బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంకిరి రామచంద్రుడు మాట్లాడుతూ× నంద్యాల పట్టణం డిస్ట్రిక్ట్ కాకా ముందే రైతునగరం ఏరియా లో విచ్చలవిడిగా ఇళ్ల నిర్మాణం జరగడం వాటిలో కొన్నివాటికి రిజిస్ట్రేషన్ లు లేకపోవడం, రిజిస్ట్రేషన్ జరిగిన వాటికీ పంచాయతీ లేఔట్ చేయించుకొని ఇళ్ల నిర్మాణం చేయించుకొని ఈరోజులకు దాదాపు 8 ఇయర్స్ అవుతుంది కానీ ఇంతవరకు ఇళ్లకు పన్నులు వెయ్యకుండా గవర్నమెంట్ కు వచ్చే లక్షల కొద్దీ ఆదాయమును పోగొడుతున్న రైతునగరం సచివాలయం సిబ్బంది. కానీ ప్రజలే స్వచ్ఛందంగా పన్నులు కట్టడానికి వస్తే వారిని వేధింపులకు గురిచేస్తూ నెలల తరబడి మరియు రోజుల తరబడి తిప్పుతూ పన్నులు కట్టలేని స్థితికి తెస్తున్న రైతునగరం సచివాలయం సిబ్బంది. ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే వాటికీ సంబందించిన గవర్నమెంట్ సిబ్బంది వాటిని గుర్తించి వాటికీ పన్నులు వేయించి గవర్నమెంట్ కు ఆదాయం పెంచాలి కానీ ఆలా జరగటం చాలా దారుణం అని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గ్రామ సచివాలయంలు బలోపేతం చేసి ప్రతి గ్రామ సచివాలయం లో వందల కొద్దీ సిబ్బంది ని నియమించిన ఉపయోగం లేకుడా పోయింది. ఇందుకు కారణం ఇంతకుమునుపే అక్కడ ఉన్న సిబ్బందిలో నిర్లక్ష్యం లోపం స్పష్టంగా కనిపిస్తుందని ఆయన అన్నారు వీటికి తోడు స్వచ్ఛందంగా పన్నులు కట్టడానికి వస్తున్నా ప్రజలను మీరు ఇప్పడి వరకు పన్నులు కట్టకుండా ఎలా ఉన్నారు, ఇప్పుడు పన్నులు కట్టించుకోండి అంటూ మా చుట్టూ తిరుగుతున్నారు అని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఒక ఇల్లు లేఔట్ అప్రూవల్ అయిపోయిన తర్వాత 6 నెలలకు కానీ 1 ఇయర్ కానీ చూసుకొని ఆ ఇల్లు పూర్తి అయ్యిందా లేదా అని చూసుకొని పన్ను కట్టించుకొని బాధ్యత ఇప్పుడు గ్రామ సచివాలయం వార్డులకు ప్రభుత్వం అవకాశం ఇట్చి, ప్రజలకు ఇంటి వద్దకే సౌకర్యాలు కల్పిస్తున్నప్పుడు, ప్రజలే స్వచ్ఛందంగా పన్నులు కట్టడానికి వస్తే వారిని వేధింపులకు గురిచేస్తున్న రైతునగం సచివాలయం సిబ్బంది. కావున ఇప్పటికైనా నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై తగు చర్య తీసుకొని, ఆయన అధికారులు కోరారు ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలుట్ల రమణ పాల్గొన్నారు

## నవంబర్ 29 తేదీ. జిల్లాస్థాయి జగనన్న క్రీడా సంబరాలు క్రీడా పోటీలు ప్రారంభం .




నంద్యాల నవంబర్ 29 రాష్ట్ర క్రీడపాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబర్ 21 2022 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ వై యస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఘనంగా నిర్వహించబోతున్న జగనన్న క్రీడా సంబరాలను జిల్లా క్రీడా పాధికార సంస్థ నంద్యాల జిల్లాలో జిల్లాస్థాయి అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా నంద్యాల జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల జట్లతో పోటీలు నిర్వహించబడును ఈ పోటీలు కబడ్డీ మహిళలు మరియు పురుషులు వాలీబాల్ మహిళలు మరియు పురుషులు క్రికెట్ పురుషులు మాత్రమే. ఈ క్రీడాంశాలలో జిల్లాస్థాయి పోటీలు జిల్లా క్రీడాపాధికార సంస్థ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పద్మావతి నగర్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల నవంబర్ 29 30 తేదీలలో నిర్వహించబడును కావున నంద్యాల జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపిక చేసినటువంటి జట్లతో జిల్లాస్థాయిలో పాల్గొంటారు మొదటి స్థానం కైవసం చేసినటువంటి అసెంబ్లీ నియోజకవర్గ జట్టును జోనల్ స్థాయికి పంపబడును. ఈ జిల్లా స్థాయి పోటీలకు నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ మరియు కౌన్సిలర్ యస్. సాయి రాం రెడ్డి , సోమశేఖర రెడ్డి ఈ జిల్లాస్థాయి జగనన్న క్రీడా సంబరాల పోటీలను ప్రారంభించారు.

# బద్వేలులో రేషన్ బియ్యం వ్యాపారుల అక్రమ దందా

**150 కల్తీ బియ్యం బస్తాలు 50 బస్తాల రేచం**

**బియ్యం పట్టివేతపోటీలు పడుతున్న రేషన్ బియ్యం వ్యాపారులు.**

**దరిశా వెంకటేశ్వర్లుపై కేసు నమోదు**



బద్వేలు, అక్రమరవాణాపై పూర్తిస్థాయిలో దృష్టి సారించిన విజిలెన్స్ అదికారులు..ప్రముఖ వ్యాపారి సునీల్ విజిలెన్స్ అదికారుల దృష్టిలో పడకుండా యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నట్లు చర్చించుకుంటున్న ప్రజలు.బద్వేలు బైపాస్ రోడ్డు వద్ద బారీగా రేషన్ బియ్యం స్వాదీనం...మినిలారీలోకి లోడ్ చేస్తుండగా పట్టుకున్న విజిలెన్స్ అదికారులు.150 బస్తాలు కల్తీ రేషన్ బియ్యం , 50 బస్తాల రేషన్ బియ్యం స్వాదీనం...మినీ లారీని సీజ్ చేసి పోలీస్ స్టేషనుకు తరలింపు.రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాపారి దరిశా వెంకటేశ్వర్లుపై కేసు నమోదు.

## ది క్రెడో పాఠశాలలో 30వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్.?

**ముఖ్యతిథిగా హాజరైన జిల్లా విద్యాధికారి**

రంగారెడ్డి.కర్నూలు: తాంద్రపాడు లో గల' ది క్రెడో పాఠశాల' లో 30వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమమును జిల్లా విద్యాధికారి రంగారెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లా విద్యాధికారి రంగారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి అబ్దుల్ కలాం ఫోటోకి పూలమాల వేసిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించే ప్రసంగిస్తూ ప్రయోగాలతోనే అద్భుతంగా ఫలితాలు సాధించవచ్చని సొంతంగా ఆలోచించడం అభివృద్ధి వైపు అడుగులు వేసే విధంగా ప్రణాళిక రచించుకోవడం విద్యార్థి దశ నుంచి నేర్చుకోవాలన్నారు. స్టేట్ రీజినల్ కో-ఆర్డినేటర్ కుమార్ బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమమైనా హాజరైన ప్రతి విద్యార్థికి తన అభినందనలు తెలియజేస్తూ చక్కటి ప్రదర్శనలు కనబరిచిన విద్యార్థులకు తన అభినందనలు తెలియజేశారు.

# హీరోగా సపోర్ట్ చేశారు.. నిర్మాతగానూ సపోర్ట్ చేసేయండి: రవితేజ



మాస్ మహారాజా రవితేజ హీరోగా సినిమాలు చేస్తూనే నిర్మాతగా మారిన సంగతి తెలిసిందే. ఖీ టీమ్ వర్క్స్ అనే బ్యానర్ ని స్థాపించి తన సినిమాల నిర్మాణంలో భాగం పంచుకుంటున్నారు. అలానే విష్ణు విశాల్ నటించిన 'ఈఎఖీ' అనే తమిళ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేసారు. ఈ క్రమంలో ఇప్పుడు "మట్టి కుస్తీ" అనే ఫ్యామిలీ అండ్ స్పోర్ట్స్ డ్రామాని నిర్మించారు రవితేజ. విష్ణు విశాల్ మరియు ఐశ్వర్య లక్ష్మి హీరో హీరోయిన్లుగా చెల్లా అయ్యావు దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం "మట్టి కుస్తీ". ఆర్టీ టీమ్ వర్క్స్ - విష్ణు విశాల్ స్టూడియోస్ బ్యానర్లపై రవితేజతో కలిసి విష్ణు ఈ సినిమాని నిర్మించాడు. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలౌతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ జోరుగా ప్రమోషన్స్ చేస్తున్నారు. ఇందులో భాగంగా 'మట్టి కుస్తీ' మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ వేడుకకు రవితేజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం మాస్ రాజాతో సినిమాలు చేస్తున్న సుధీర్ వర్మ - వంశీలతో పాటుగా విష్ణు విశాల్ భార్య జ్వాలా గుత్తా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవితేజ - విష్ణు - ఐశ్వర్య లక్ష్మి - జ్వాలా గుత్తా కలిసి సినిమాలోని చల్ చక్కని చిలక పాటకు వేదికపై డ్యాన్స్ చేసి ప్రేక్షకులని అలరించారు. అనంతరం రవితేజ మాట్లాడుతూ.. 'మట్టి కుస్తీ' సినిమాకి పని చేసిన సాంకేతిక నిపుణులందరికీ థాంక్స్. ఈ సినిమాకి మ్యూజిక్ ఇచ్చిన జస్టిన్ ప్రభాకరన్ సౌండ్ - బ్యాగ్రౌండ్ స్కోర్ అంటే నాకు చాలా చాలా ఇష్టం. తనతో సినిమా కూడా చేయాలని విష్ణుతో చెప్పాను. రిచర్డ్స్ వండర్ ఫుల్ కెమెరామెన్. దర్శకుడు చెల్లా అయ్యావు కథ చెప్పినపుడు నవ్వీ నవ్వీ చచ్చాను. తన సెన్స్ ఆఫ్ హ్యూమర్ బావుంటుంది. తనతో కచ్చితంగా ఓ సినిమా మాత్రం చేయాలి అని అన్నారు."అందం ప్రతిభ కలిపితే ఐశ్వర్య లక్ష్మి. ఇందులో ఆమె పాత్రని ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. విశాల్ - ఐశ్వర్య కెమిస్ట్రీ స్టన్నింగ్ గా వుంటుంది. ఇది కేవలం స్పోర్ట్స్ ఫిల్మ్ మాత్రమే కాదు.. ఎమోషన్ ఫ్యామిలీ లవ్ ఎంటర్టైన్మెంట్ అన్నీ వున్నాయి. ఆర్టీ టీమ్ వర్క్స్ - విష్ణు విశాల్ స్టూడియోస్ ఈ రెండు టీములు సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథులు అభిమానులే. హీరోగా ఎంతో సపోర్ట్ చేశారు. నిర్మాతగా కూడా సపోర్ట్ చేసేయండి. విష్ణు విశాల్ పాజిటివ్ పర్సన్. ఫస్ట్ మీటింగ్ లోనే విశాల్ కు ఎప్పటి నుండో తెలుసనే ఫీలింగ్ కలిగింది. అన్నీ సింగిల్ సిట్టింగ్ లోనే మొదలైపోయాయి. సినిమా చాలా బావొచ్చింది. మీరు ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. డిసెంబర్ 2న థియేటర్లో కలుద్దాం" అని రవితేజ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా విష్ణు విశాల్ మాట్లాడుతూ.. 'మట్టి కుస్తీ' డిసెంబర్ 2 థియేటర్లో గ్రాండ్ రిలీజ్ అవుతుంది. చాలా ఆనందంగా వుంది. రవితేజ గారు గ్రేట్ హ్యూమన్ బీయింగ్. ఆయనది చాలా మంచి మనసు. ఒక్క మీటింగ్ లోనే నాపై పూర్తి నమ్మకం ఉంచారు. జ్వాలా నన్ను తెలుగు సినిమాలు చేయాలనీ చెప్పేది. తెలుగు ప్రేక్షకులు మంచి కంటెంట్ ని ప్రేమిస్తారు. రవితేజ గారి లాంటి గొప్ప వ్యక్తి సపోర్ట్ తో మీ ముందుకు వస్తున్నాను. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ తో మంచి ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ తో పాటు ఆడ మగ సమానమనే సందేశాన్ని చాటే సినిమా ఇది. మహిళా ప్రేక్షకులు సినిమాని చాలా ఇష్టపడతారు. డిసెంబర్ 2న అందరూ థియేటర్ కి వెళ్లి 'మట్టి కుస్తీ' చూడాలి అని కోరారు.

# 'బాబా' కోసం మళ్లీ డబ్బింగ్ చెప్పిన సూపర్ స్టార్!

ఈ మధ్య స్టార్ హీరోలు నటించిన సినిమాల్లో వారి కెరీర్ ని మలుపు తిప్పిన బ్లాక్ బస్టర్ మూవీస్ ని రీ మాస్టర్ చేస్తూ రీ రిలీజ్ చేస్తున్న విషయం తెలిసిందే. స్టార్ హీరోల బర్త్ డేలని టార్గెట్ చేసుకుని రిలీజ్ చేస్తున్న సినిమాలు ఇన్నేళ్ల తరువాత కూడా మంచి వసూళ్లని రాబడుతుండటంతో చాలా మంది ఈ తరహా సినిమాలని రీమాస్టర్ చేస్తూ రీ రిలీజ్ కి రెడీ అవుతున్నారు. ఈ సరికొత్త ట్రెండ్ కు సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన 'పోకిరి'తో శ్రీకారం చుట్టారు.ఆ తరువాత పవన్ కల్యాణ్ జల్సా ప్రభాస్ వర్షం రెబల్ బిల్లా.. వంటి సినిమాలు కూడా రీ రిలీజ్ కావడం తెలిసిందే. సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ




నటించిన 'చెన్నకేశవరెడ్డి'ని కూడా ఇదే తరహాలో రిలీజ్ చేశారు. ఇక ఈ ట్రెండ్ నిర్మాతలకు మరోసారి కాసులు కురిపిస్తుండటంతో ఫ్లాప్ సినిమాలని కూడా పనిలో పనిగా లైన్ లో పెడుతూ రీమాస్టర్ చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ తరహా సినిమాలకు ఫ్యాన్స్ భారీ స్థాయిలో ఎగబడుతుండటంతో ఈ తరమా సినిమాల రీ రిలీజ్ ల పరంపర అప్రతిహతంగా కొనసాగుతోంది.త్వరలో సూపర్ స్టార్ కృష్ణ నటించి తెరకెక్కించిన తొలి 70 ఎం ఎం మూవీ 'సింహాసనం'ని 8కెలో రీమాస్టర్ చేస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. త్వరలోనే ఈ మూవీని రీ రిలీజ్ చేయబోతున్నారు. ఇదిలా వుంటే సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా సురేష్ కృష్ణ అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కించిన మూవీ 'బాబా'. 2002 ఆగస్టు 15న తమిళ తెలుగు భాషల్లో విడుదలైన ఈ మూవీని రీమాస్టర్ చేసి రీ రిలీజ్ చేయబోతున్నారు.20 ఏళ్ల తరువాత మళ్లీ ఈ మూవీని మరిన్ని ప్రత్యేకతలతో తమిళ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇప్పటి వరకు విడుదల చేసిన సినిమాలు రీమాస్టర్ చేసి 4కెలో విడుదల చేస్తే 'బాబా'ని మాత్రం అదనపు సీన్స్ ని జోడించి రిలీజ్ చేస్తుండటం విశేషం. తాజాగా ఈ సీన్స్ కి సంబంధించి స్వయంగా రజనీకాంత్ డబ్బింగ్ చెప్పారు. ఇటీవలే అతనపు సీన్స్ కి సంబందించిన డబ్బింగ్ ని సూపర్ స్టార్ రజనీకాంత్ పూర్తి చేయడంతో అందుకు సంబంధించిన స్టిల్ ఒకటి ప్రస్తుతం నెట్టింట చెక్కర్లు కొడుతోంది.భారీ అంచనాల మధ్య 2002లో విడుదలైన ఈ మూవీ ఆశించిన స్థాయిలో అభిమానుల్ని ఆకట్టుకోలేకపోయింది. జీవిత తత్వాన్ని బోధిస్తూ వేదాంత ధోరణికి సమకాలీన రాజకీయాలని జోడించి తెరకెక్కించిన తీరు పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. 'బాషా' లాంటి గేమ్ ఛేంజర్ మూవీని రజనీకి అందించిన సురేష్ కృష్ణ ఈ సినిమాని తెరకెక్కించినా ఆ మ్యాజిక్ ని మాత్రం 'బాబా'తో రిపీట్ చేయలేకపోయాడు.

# నటవారసుడి డెబ్యూ.. స్టార్ కాస్టింగ్ లో తగ్గేదేలే



బాలీవుడ్ లో మరో నటవారసుడి ఘనమైన ఎంట్రీకి రంగం సిద్ధమవుతోంది. యథావిధిగా సదరు నటవారసుడిని డీన్ కరణ్ జోహార్ వెండితెరకు పరిచయం చేస్తుండడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రముఖ స్టార్ హీరో సైఫ్ అలీఖాన వారసుడు ఇబ్రహీం అలీఖాన్ తొలి చిత్రం కోసం కరణ్ జోహార్ యాజమాన్యంలోని ధర్మ ప్రొడక్షన్స్ ఇప్పటికే ప్రీప్రొడక్షన్ కాస్టింగ్ ఎంపికలను ప్రారంభించింది. ఇబ్రహీం అలీఖాన్ తొలి సినిమాకి కయోజ్ ఇరానీ దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. తాజా సమాచారం మేరకు ఈ చిత్రంతో 12 ఏళ్ల తర్వాత కాజోల్ మళ్లీ తన స్నేహితుడు కం నిర్మాత అయిన కరణ్ తో జతకట్టింది. కరణ్ జోహార్ - కాజోల్ చిన్నప్పటి నుండి స్నేహితులు. బాలీవుడ్ లో కుచ్ కుచ్ హోతా హై- దిల్వాలే దుల్హనియా లే జాయేంగే - కభీ ఖుషీ కభీ గమ్ వంటి అనేక హిట్ ప్రాజెక్ట్ లను ఈ కాంబో అందించారు. అయితే కరణ్ 'ఏ దిల్ హై ముష్కిల్' .. అజయ్ దేవగన్ నటించిన 'శివాయ్' బాక్సాఫీస్ వద్ద ఘర్షణ పడడంతో కరణ్ - కాజోల్ నడుమ స్నేహబంధం చెడిందని కథనాలొచ్చాయి. వీరిద్దరూ తమ విభేదాలను ఇప్పటికి పరిష్కరించుకున్నారు. వారు మళ్లీ కలుస్తారని అభిమానులు చాలా కాలంగా ఆసక్తిగా ఎదురుచూస్తుండగా తాజాగా శుభవార్త అందింది.ఇప్పుడు ఇబ్రహీం అలీ ఖాన్ తొలి ప్రాజెక్ట్ కోసం ఆ ఇద్దరి పునఃకలయిక ఖరారైనందున ఇన్నాళ్ల అభిమానుల నిరీక్షణకు చెక్ పడిపోబోతోంది.

# మీ శరీరంలోని ఈ ప్రాంతంలో మీకు తీవ్రమైన నొప్పి ఉంటే అది ఈ ప్రాణాంతక సమస్య కావచ్చు!




కొలెస్ట్రాల్ ప్రతి ఒక్కరి శరీరానికి అవసరం. కానీ అతిగా చేయడం కొన్నిసార్లు తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుంది. కొలెస్ట్రాల్, మృదువైన కొవ్వు లాంటి పదార్థం, కొత్త కణాలను నిర్మించడంలో సహాయపడుతుంది మరియు హార్మోన్లను ఉత్పత్తి చేయడం వంటి ముఖ్యమైన శారీరక విధులను నిర్వహిస్తుంది. కొలెస్ట్రాల్ ట్రైగ్లిజరైడ్ ఒక లిపిడ్, ఇది ఒక రకమైన కొవ్వు. కొవ్వులు, మైనపులు, నూనెలు మరియు హార్మోన్లు అన్నీ లిపిడ్ల వర్గంలోకి వస్తాయి. మరియు కొలెస్ట్రాల్ అనేది కణ త్వచం యొక్క అంతర్భాగం, ఇది మన శరీర కణాలచే ఏకీకృతం చేయబడుతుంది. వేరుచేయబడినప్పుడు, ఇది రక్తంలో అధికంగా ఉండే పసుపు స్ఫటికాకార పదార్థాన్ని అధిక కొలెస్ట్రాల్ అని పిలుస్తారు మరియు దాని ప్రభావాలు శరీరానికి చాలా ప్రమాదకరమైనవి. కొలెస్ట్రాల్ రక్తాన్ని చిక్కగా చేస్తుంది మరియు దాని సరైన ప్రసరణకు అంతరాయం కలిగిస్తుంది, ముఖ్యంగా ధమనుల ద్వారా. ఎందుకంటే ఇది ధమనుల గోడలపై మెరుస్తూ వాటిని మూసుకుపోతుంది. ఇది ప్రాణాంతక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ఈ ఆర్టికల్లో, శరీరంలోని ఏదైనా భాగంలో తీవ్రమైన నొప్పి హెచ్చరిక సంకేతంగా ఉంటుందని మీరు కనుగొంటారు. అధిక కొలెస్ట్రాల్ ప్రమాదాలు అధిక కొలెస్ట్రాల్ ప్రమాదాలు ఈ రోజుల్లో, చాలా మంది ప్రజలు అధిక కొలెస్ట్రాల్తో పోరాడుతున్నారు. ఇప్పుడు అధిక కొలెస్ట్రాల్ యొక్క సాధారణ కారణాలు జాబితా చేయబడ్డాయి. అధిక కొలెస్ట్రాల్ను నివారించడానికి, వాటిని చదవడం మరియు వాటిపై శ్రద్ధ పెట్టడం మంచిది.: మీరు క్లాత్ మాస్క్ ఉపయోగిస్తున్నారా? ఐతే వెంటనే క్లాత్ మాస్క్ ధరించడం మానేయండి.. : మీరు క్లాత్ మాస్క్ ఉపయోగిస్తున్నారా? ఐతే వెంటనే క్లాత్ మాస్క్ ధరించడం మానేయండి.. కొలెస్ట్రాల్ స్థాయిలు కొలెస్ట్రాల్ స్థాయిలు ధమనుల గోడలపై కొలెస్ట్రాల్ నిక్షేపాలు ధమనులను తగ్గించవచ్చు లేదా వాటిని పూర్తిగా నిరోధించవచ్చు. ధమనులు మూసుకుపోవడం వల్ల వాటిని కష్టతరం చేస్తుంది మరియు రక్త ప్రసరణను అడ్డుకుంటుంది. ఇది రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని పెంచుతుంది. ఇది గుండె లేదా మెదడుకు రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటుంది,

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**